నేటి కందం-నేటికి అందం

భారత స్త్రీలే చాలును
పారుచు నున్నట్టి దుష్ట పాకిస్థానున్
పారగు రాళ్ళయి గెలువగ
తీరుగ క్రిక్కెట్టునగల దివ్యత జూపన్ !!

(పాకిస్థాన్ జట్టును మన భారత మహిళా క్రికెటర్లు చిత్తు చిత్తుగా ఓడించి క్రిక్కెట్ ఆట లోని గొప్పతనాన్ని ప్రపంచానికి రుచి చూపించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

కారుమీద సారు ఇకా
కలెదిరిగే మంచి రోజు
వస్తుందో రాదో కానీ
విమర్శలపైనే మోజు.
ఫాంహౌజుకే పరిమితం
ప్రతిపక్షం నేత పాత్ర
అయితే ఎట్లా అసెంబ్లీలో
అవును తాను రుద్ర నేత్ర.

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 8-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:31 పేజీలు:6 వెల: రూ.1/-


## ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు.. అసెంబ్లీ స్పీకర్ భావోద్వేగం



హైదరాబాద్, సెప్టెంబర్ 7: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలపై స్పీకర్ మనస్తాపం వ్యక్తం చేశారు. స్పీకర్‌ను కలిసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంఘీభావం తెలిపారు.అయితే, స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోను సీఎంవో విడుదల చేసింది. ఈ క్రమంలోనే తాతా మధుపై చర్యలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. సభ నుంచి తాతా మధును బహిష్కరించే యోచనలో చైర్మన్ ఉన్నారు.

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అవమానించేలా బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడారని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పీకర్ గౌరవాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. బీజేపీకి కూడా బాధ్యత ఉందని చెప్పారు. బీజేపీ నేతలు సభకు సహకరించాలని కోరారు. స్పీకర్‌ను బీఆర్ఎస్ తాతామధు అవమానించడంపై బీజేపీ వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ రూల్స్ పాటించలేదని.. ఇప్పుడు ప్రతిపక్షంలోనూ రూల్స్ పాటించట్లేదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహించారు.

## కేసీఆర్ క్షమాపణ చెప్పాలి.. మధును డిస్మిస్ చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 7: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలపై అసెంబ్లీలో దుమారం చెలరేగింది. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ.. చీకటి మిత్రులను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో చర్చలు జరిగిన తర్వాతే నిర్ణయాలు జరుగుతాయని.. నిర్ణయాలు జరిగిన తర్వాత చర్చలు జరగవని స్పష్టం చేశారు. అన్ని అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. బీజేపీ లేవనెత్తిన అంశాలపైనా చర్చ జరుగుతుందన్నారు. స్పీకర్ చైర్‌ను అవమానిస్తే స్పందించాల్సిన అవసరం బీజేపీకి లేదా అని ప్రశ్నించారు. సభ్యుల హక్కులను కాపాడే స్పీకర్‌ను అవమానించారని మండిపడ్డారు.

అత్యంత అవమానకరంగా స్పీకర్‌నుద్దేశించి మాట్లాడితే.. ఇంతకంటే చర్చకు ప్రాధాన్యమున్న అంశం ఇంకేముంటుందని సీఎం అడిగారు. ఇది స్పీకర్ చైర్ గౌరవానికి సంబంధించిన విషయంగా చెప్పుకొచ్చారు. సభాపతి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బీఆర్ఎస్ వేసిన అపవాదు, దుర్మార్గాలను బీజేపీ ఎందుకు కాపాడుతోందని ప్రశ్నించారు. సమాజం తలదించుకునేలా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇవాళ తెలంగాణకు చీకటిరోజని అన్నారు. ఇది 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమని తెలిపారు. దూషించాలని కేసీఆరే పురిగొల్పి పంపించారని ఆరోపించారు. సభ్య సమాజం సహించలేని భాష మాట్లాడారంటూ సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

దళితులు, గిరిజనులే కాదు.. సభ్య సమాజానికే జరిగిన అవమానం ఇది అని ముఖ్యమంత్రి అన్నారు. ఇవాళ తెలంగాణ ఆత్మగౌరవానికే గాయమైందని.. స్పీకర్‌పై అత్యంత అసభ్యకరంగా మాట్లాడారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక దళిత వ్యక్తిని సీఎం చేస్తానని, దళితులకు 3 ఎకరాలు ఇస్తామని చెప్పి కేసీఆర్ మోసం చేశారని మండిపడ్డారు. దళిత ఉప ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేసిన ఘనత కేసీఆర్‌ది అంటూ వ్యాఖ్యానించారు. సభాపతిని దూషించడం అందరికీ అవమానకరమన్నారు. స్పీకర్‌పై అభ్యంతరకరంగా మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును సమర్థించాలని బీజేపీ చూస్తోందా అని ప్రశ్నించారు. అందరం ముక్తకంఠంతో ఖండించాల్సిన సమయమిది అని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని సూచించారు.దళిత వ్యక్తిని ప్రతిపక్ష నేతగా చూడలేకపోతున్నారని సీఎం అన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక ఆలోచనను సరిదిద్దకపోతే భవిష్యత్ తరాలు ఈ సభను క్షమించవన్నారు. ఈ రకమైన అవమానం ఎప్పుడూ, ఎక్కడా జరగలేదని వ్యాఖ్యానించారు. ఈ అంశానికి సంబంధించి కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. స్పీకర్ చైర్‌ను అభ్యంతరకర భాష మాట్లాడిన ఎమ్మెల్సీ తాతా మధును బీఆర్ఎస్ డిస్మిస్ చేయాలన్నారు. తాతా మధుతో రాజీనామా చేయించాలని.. లేకపోతే బర్తరఫ్ చేయాలన్నారు. తాము ఏం మాట్లాడినా వెనుక కేసీఆర్ ఉన్నారని బీఆర్ఎస్ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తాతా మధుపై చర్యలు తీసుకోవాల్సిందే: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 7: బీజేపీ ఎమ్మెల్యేల ఆందోళనలతో వాయిదా పడిన తెలంగాణ శాసనసభ తిరిగి మొదలైంది. ఈ సందర్భంగా స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. స్పీకర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దుర్భాషలాడారని మండిపడ్డారు. తాతా మధు వ్యాఖ్యలపై అందరం మనస్తాపం చెందామని.. ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందే అని తెలిపారు. స్పీకర్ వ్యవస్థ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత బీజేపీకి లేదా అని ప్రశ్నించారు. స్పీకర్ చైర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదని.. స్పీకర్‌ను దూషించడం దుర్మార్గమని మండిపడ్డారు. స్పీకర్‌ను అవమానించడంపై బీజేపీ వైఖరి చెప్పాలని.. ఆయనకు జరిగిన అవమానంపై ఆ పార్టీ మాట్లాడాలని డిమాండ్ చేశారు.

సభ్యులు సభా సంప్రదాయాలను కాపాడాలని సూచించారు. ఈ అంశంలో బీజేపీ సహకరించాలన్నారు. బీఆర్ఎస్ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగాన్ని బీజేపీ సభ్యులు అడ్డుకోవడంతో అసెంబ్లీ గందరగోళం నెలకొంది. సభలో బీజేపీ సభ్యులు నినాదాలు చేశారు. బీజేపీ సభ్యులు సభను అడ్డుకోవడం సరికాదని.. ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధమని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

## సబితా ఇంద్రారెడ్డిని జుట్టు పట్టుకుని వాహనంలో ఎక్కించిన పోలీసులు..

### మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల కర్కశత్వం



హైదరాబాద్, సెప్టెంబర్ 7: తెలంగాణ అసెంబ్లీ సమావేశాల వేళ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర చర్చకు దారి తీసింది. అసెంబ్లీకి వస్తున్న మహిళా ప్రజాప్రతినిధులను కూడా చూడకుండా పోలీసులు కర్కశంగా వ్యవహరించారు. అసెంబ్లీ లోపలికి వెళ్తున్న సమయంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగడంతో తీవ్ర ఆవేదనకు గురైన ఆమె అక్కడే కన్నీళ్లు పెట్టుకున్నారు. అదే సమయంలో మహిళా సభ్యులను అరెస్టు చేసే క్రమంలో సబితా ఇంద్రారెడ్డిని జుట్టు పట్టుకుని బలవంతంగా వాహనంలోకి ఎక్కించారు.

మహిళా ఎమ్మెల్యేలు అనే కనీస గౌరవం కూడా లేకుండా పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. ప్రజల తరఫున అసెంబ్లీకి హాజరయ్యేందుకు వచ్చిన మహిళా ప్రజాప్రతినిధులనే ఇలా అవమానించడం ఏమిటని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగిన సమయంలో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఇవాళ అసెంబ్లీ చరిత్రలో చీకటి రోజు అని సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఎలాగూ మహిళలకు భద్రత లేదని.. శాసనసభలో కూడా భద్రత లేకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. మేం నల్లటి టీషర్ట్ కూడా ధరించలేదు.. అయినా మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నిస్తే పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని అన్నారు. ఇదేనా ప్రజాపాలనలో మహిళలకు దక్కే గౌరవమని ప్రశ్నించారు.

నిరసన చేయడానికి మాకు హక్కు లేదా అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. మహిళలు అని కూడా చూడకుండా ఇష్టానుసారంగా తోసేస్తున్నారని మండిపడ్డారు. వెయ్యి రోజుల పాలన గురించి కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. కానీ అసలు నిజాలు తెలుస్తాయనే తమను అసెంబ్లీకి రానివ్వడం లేదని ఆరోపించారు.

కాగా, అసెంబ్లీ ఎదుట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పోలీసులు వ్యవహరించిన తీరును ఆ పార్టీ తీవ్రంగా ఖండించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు నిరసనగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎక్కడికక్కడ ఆందోళనలు చేపట్టాలని బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించింది.

## మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల తీరు దారుణం: కవిత

హైదరాబాద్, సెప్టెంబర్ 7: తెలంగాణ అసెంబ్లీ వద్ద మహిళా శాసన సభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులైన మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించడం తీవ్రంగా ఖండించాల్సిన అంశమని ఆమె పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేలకే రక్షణ లేకపోతే రాష్ట్రంలో సామాన్య మహిళల భద్రత పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు.

వరంగల్ ఫీజు రీ ఎంబర్స్మెంట్ ధర్నా అనంతరం అసెంబ్లీ పరిసరాల్లో చోటుచేసుకున్న ఘటనపై కవిత స్పందిస్తూ సామాజిక మాధ్యమంలో వీడియో విడుదల చేశారు. బీఆర్ఎస్ సీనియర్ మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు వ్యవహరించిన తీరు ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. మహిళా శాసన సభ్యులను అడ్డుకునే క్రమంలో వారి పట్ల బలప్రయోగం చేయడం, గొంతు పట్టుకుని నెట్టడం, చీరలు లాగడం వంటి ఘటనలు జరిగాయని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా బూటు కాళ్లతో తొక్కుతూ హింసించారని పేర్కొంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళా ప్రజాప్రతినిధులకే అసెంబ్లీ వంటి కీలక ప్రదేశంలో భద్రత లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని కవిత అన్నారు. ప్రజల తరఫున సమస్యలను ప్రస్తావించేందుకు వచ్చిన మహిళా ఎమ్మెల్యేల పట్లే ఇలాంటి వ్యవహారం ఉంటే.. రాష్ట్రంలోని సాధారణ మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. మహిళలకు భద్రత కల్పించాల్సిన ప్రభుత్వమే వారి పట్ల జరుగుతున్న దాడులను నియంత్రించడంలో విఫలమవుతోందని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మహిళలపై హింస, దాడులు పెరుగుతున్నాయని కవిత ఆరోపించారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు పొంతన లేదన్నారు. ప్రస్తుత డీజీపీ బాధ్యతలు చేపట్టిన తర్వాత పరిస్థితులు మరింత దిగజారాయని ఆమె విమర్శించారు.


మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా వ్యవహరించిన పోలీసులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులను గుర్తించి, వారిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా ప్రతినిధుల పట్లే ఇలాంటి ప్రవర్తనను సహించకూడదని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. మహిళల భద్రతపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని, మహిళా ప్రజాప్రతినిధుల గౌరవం, భద్రతకు పూర్తి రక్షణ కల్పించాలని కవిత డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవద్దు.. డీజీపీకి హైకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవద్దని రాష్ట్ర డీజీపీకి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అలాగే బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్ విచారించిన హైకోర్టు ఈ అంశంపై పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ, కేసును రెండు వారాలకు వాయిదా వేసింది.

కాగా, సోమవారం కాంగ్రెస్ 1000 రోజుల పాలన వైఫల్యాన్ని నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య తోపులాట జరి గింది. మహాళా ఎమ్మెల్యేలు అని చూడా కూండా జుట్టు పట్టి, చీరలాగి అమానవీయంగా ప్రర్తించారు. పోలీసుల తీరును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి.

## ఏడాదికి 50 రాకెట్లను ప్రయోగించాలి: ఇస్రో చీఫ్ నారాయణన్




బెంగుళూరు, సెప్టెంబర్ 7: భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో)ను ప్రైవేటీకరించడం లేదని ఇస్రో చైర్మెన్ వీ నారాయణన్ స్పష్టం చేశారు. అంతరిక్ష సంస్థ ప్రభుత్వం సంస్థగానే ఉంటుందని ఆయన వెల్లడించారు. భారతీయ అంతరిక్ష వ్యవస్థను మరింత విస్తరించేందుకు ప్రైవేటు కంపెనీలు, స్టార్టప్‌లతో కలిసి పనిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇస్రోను ప్రైవేటీకరిస్తున్నట్లు ఆ సంస్థకు చెందిన 9 ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తూ ఆగస్టు 4వ తేదీన లేఖ రాసిన నేపథ్యంలో ఆ అంశంపై చైర్మెన్ నారాయణన్ రియాక్ట్ అయ్యారు. మాన్యుఫ్యాక్చరింగ్, ఆపరేషనల్ ఫంక్షన్స్‌కు ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశంపై ఆయన క్లారిటీ ఇచ్చారు.

9వ బెంగుళూరు స్పేస్ ఎక్స్‌పోను ప్రారంభించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. భారతీయ అంతరిక్ష సంస్థకు 65 ఏళ్లు నిండాయని, దేశ సాధారణ ప్రజలకు సేవలందించేందుకు అంతరిక్షంలో 56 భారత అసెట్స్ ఉన్నట్లు చెప్పారు. కానీ వాటి అవసరం ఇంకా ఎక్కువగా ఉన్నట్లు ఆయన చెప్పారు. అంతరిక్ష రంగంలో ఆరేళ్ల క్రితం పెద్ద ఎత్తున ప్రక్షాళన మొదలైందని, దాని ప్రకారం ప్రైవేటు రంగం, స్టార్టప్ కంపెనీలతో కలిసి అంతరిక్ష వ్యవస్థను మరింత వృద్ధి చేయాలన్నారు. పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ ప్రయోగించినప్పుడు, 80 శాతం బడ్జెట్‌ను భారతీయ పరిశ్రమల్లో ఇన్వెస్ట్ చేస్తున్నట్లు తెలిపారు.

సుమారు 450 కంపెనీలు ఇస్రో కోసం పనిచేస్తున్నట్లు నారాయణన్ చెప్పారు. ఇస్రో ఉద్యోగులు వ్యక్తం చేసిన ఆందోళన గురించి ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆందోళన వాస్తమైందే అని, దానిపై క్లారిటీ ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. అంతరిక్ష ఆశయాలను సాధించేందుకు రాకెట్ ప్రయోగాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఏడాది సుమారు 50 లాంచ్‌లు జరగాలని ఆయన తెలిపారు. ఈ అంశంలో మనం ముందుకు వెళ్లాల్సిన అనవరం ఉందన్నారు. ఇస్రోను ప్రైవేటీకరించలేదని, ఓ ప్రభుత్వ సంస్థగానే ఉందన్నారు. ఇస్రోలోనే మనం పనిచేస్తున్నామని, ఇది గవర్నమెంట్ పెట్టుబడి అని, కానీ మనకు చాలా కార్యక్రమాలు ఉన్నాయని, దేశంలో అంతరిక్ష వ్యవస్థ వృద్ధి కావాలని, స్పేస్ ఎకానమీ పెరగాల్సి ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఇస్రోలో 43 ఏళ్ల క్రితం తాను చేరినప్పుడు మూడేళ్లకు ఓ లాంచ్ ఉండేదని, కానీ ఇప్పుడో వేగం పెరిగిందని, దాని ప్రకారమే ఏడాదికి 50 ప్రయోగాలు చేపట్టాల్సిన టార్గెట్ ఉన్నట్లు నారాయణన్ తెలిపారు.

## రన్‌వే నుంచి దూసుకెళ్లిన కార్గో విమానం.. అయిదుగురు మృతి



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 7: అమెరికాలోని మియామి అంతర్జాతీయ విమానాశ్రయంలో .. అమెజాన్ కార్గో విమానం(ంఎజీళినీని అజీతీణనీ ఖశ్రీజీనివ) కూలింది. రన్‌వేపై ల్యాండ్ అవుతున్న సమయంలో ఆ విమానం పక్కకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో అయిదురు మృతిచెందారు. మరో అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. రన్‌వేపై దిగిన తర్వాత ఆ విమానం సమీపంలో పార్క్ చేసిన కార్ల వైపు దూసుకెళ్లిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. బోయింగ్ 767-300 కార్గో విమానం ప్యూర్టో రికాలోని లూయిస్ మునోజ్ మారిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరింది. అయితే ప్రమాద ఘటన పట్ల దర్యాప్తు చేపట్టినట్లు అమెజాన్ సంస్థ పేర్కొన్నది. స్థానిక అధికారులతో ఈ అంశంపై చర్చిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. క్రాష్ సైట్ వద్ద దట్టమైన పొగలు వ్యాపించడంతో ఆ విమానాశ్రయంలో అన్నివిమానాలను గ్రౌండ్ చేస్తూ ఫెడరల్ ఏవియేషన్ శాఖ ఆదేశాలు ఇచ్చింది.

అయితే చనిపోయిన వ్యక్తులు విమానంలో వారా లేక గ్రౌండ్‌పై ఉన్నవారు మృతిచెందారా ఇంకా తెలియదు. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే రెస్క్యూ బృందం అక్కడకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. అయిదుగురిలో ముగ్గురు తీవ్రంగా గాయపడినట్లు మియామి ఫైర్ చీఫ్ రాయిద్ జదల్లా తెలిపారు. నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు ఈ ఘటన పట్ల దర్యాప్తు చేపట్టనున్నది. 200 మంది అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పారు. కానీ విమానం నుంచి ఫ్యూయల్ లీక్ అవుతున్నట్లు చెబుతున్నారు.

# నేటి వైద్య విధానాల్లో ఫిజియోథెరపిస్టుల సేవలు అనివార్యం

## (08 సెప్టెంబర్ "ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం" సందర్భంగా)

పుట్టిన వారు గిట్టక తప్పదు. చిన్న పిల్లలు యువకులుగా, యువత వయోజనులుగా, వయోజనులు వృద్ధులుగా మారడం అనివార్యం. వయస్సు పెరిగిన కొలది అనారోగ్య సమస్యలు, శరీర కదలికలు, కీళ్ల కదలికలు, శ్రేయస్సు, జీవన నాణ్యత, స్వయం ప్రతిపత్తితో జీవితం క్రమంగా తగ్గుతాయి. వయోవృద్ధుల్లో అనారోగ్య సమస్యలు పెరగడమే కాకుండా శరీర కదలికలు, చురుకుగా కదలడం క్రమంగా తగ్గడంతో ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు శక్తి సామర్థ్యాలు, సంతులిత జీవన విధానం, ఆత్మ విశ్వాసం నూరి పోయడానికి "ఫిజియోథెరపీ" వైద్య విధానాలు, ఫిజియోథెరపిస్టు"ల అమూల్య సేవలు అత్యంత ప్రయోజనకరంగా ఉపయోగపడతాయి. ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల జనాభా క్రమంగా పెరుగుతున్నట్లు జనాభా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2019లో ప్రపంచ జనాభాలో 1 బిలియన్ 60 ఏండ్లు దాటిన సీనియర్ సిటిజన్స్ ఉన్నారని తేలింది. 2030 వరకు వీరి సంఖ్య 1.4 బిలియన్లు, 2050 నాటికి 2.1 బిలియన్ల వృద్ధులు ఉంటారని అంచనా వేస్తున్నారు. 2050 నాటికి 80 ఏండ్లు దాటిన వయోవృద్ధులు 426 మిలియన్లు అండవచ్చని అంచనా.

### ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం-2026:

ఫిజియోథెరపీ వైద్య విధానంతో పాటు ఫిజియోథెరపిస్టుల పాత్రను వివరించడానికి, సామాన్యులకు అవగాహన పర్చడానికి, వయస్సు మళ్లిన లేదా ప్రమాదాలకు గురైన లేదా ఎముకల సంబంధ ఇబ్బందులతో సతమతం అవుతున్న రోగులకు ఫిజియోథెరపిస్టుల సేవలను గుర్తించడానికి ప్రతి ఏటా సెప్టెంబర్ 08న విశ్వ మానవాళి "ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం (వరల్డ్ ఫిజియోథెరపీ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. ఫిజియోథెరపీ వైద్య సేవలతో శారీరక చురుకుదనం పెరగడం, స్వతంత్రంగా జీవించడం, భవిష్యత్తులో ఆరోగ్యంగా జీవించడం సుసాధ్యం అవుతున్నది. వయోవృద్ధులు నిత్యం పలు ఆరోగ్య సమస్యలతో సతమతం కావడం, పడి పోవడంతో గాయాల పాలు కావడం తరుచుగా జరుగుతుంది. వయోవృద్ధుల జనాభా పెరగడంతో వారి చురుకుదనం, శరీర అవయవాల కదలికలు, శారీరక బలం, శ్రేయస్సుకు భంగం కలుగుతోందని, ఈ వర్గానికి ఫిజియోథెరపిస్టులు లేదా ఫిజియోథెరపీ వైద్యం ఒక అద్భుత వరంగా మారుతున్నది.

### ఫిజియోథెరపీ వైద్య విధాన ప్రయోజనాలు :

వయస్సును మరిచి ప్రతి ఒక్కరు శారీర క్రమ లేదా వ్యాయామాలు చేయడం తప్పనిసరి. ఫిజియోథెరపిస్టులు వ్యక్తుల సమస్యలను బట్టి శారీరక వ్యాయామాలు సూచిస్తారు. కండరాల పటుత్వం, అవయవాల కదలికలు, సమతుల్య జీవన విధానం కొనసాగడానికి ఫిజియోథెరపీ ఎంతగానో ఉపయోగపడుతున్నది. శరీరం బలహీనంగా మారకుండా ఉండడానికి ప్రతి రోజు విధిగా ఫిజియోథెరపిస్చుల సూచన మేరకు వ్యాయామాలు చేయడం జరుగుతున్నది. వయోవృద్ధుల ఆరోగ్య సౌభాగ్యానికి, నాణ్యమైన జీవితాన్ని గడపడానికి ఫిజియాథెరపీ ఎంతగానో ఉపయుక్తంగా ఉంటున్నది. ఫిజియోథెరపీ సేవలతో శరీర అవయవాల కదలికలు సాధారణ స్థితికి రావడం, నొప్పులు తప్పడం, స్వతంత్రంగా జీవించగలగడం, గాయాల నుంచి బయట పడడం, ఆరోగ్య సమస్యలు రాకుండా చూడడం, శారీరక శక్తిని పెంచడం, శరీర అవయవాల చురుకుదనం, ఎముకలు విరిగిపడడు పూర్వ స్థితికి తీసుకురావడం, ఊపిరితిత్తులను చైతన్య పరచడం, కీళ్ల నొప్పులను తగ్గించడం, జ్వరం తగ్గడం లేదా సర్జరీ అనంతర సేవలు లాంటి ప్రయోజనాలు ఒనగూడుతాయి. ఇలాంటి రోగులకు సరైన వ్యాయామాలు, మ్యాన్యువల్ థెరపీ, ఆరోగ్య పరిరక్షణ విద్య, ఆధునిక సాంకేతిక చికిత్సా మార్గాలతో ఆరోగ్యం కుదుట పడుతుందని గమనించాలి. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అన్ని వయస్సుల వారికి ఫిజియోథెరపీ సేవలు విధిగా అవసరం అవుతున్నాయి.

ఆర్థోపెడిక్, న్యూరో, చెస్ట్, లేజర్ థెరపీ, వెన్ను నొప్పి లాంటి వర్గాల చికిత్సకు ఫిజియోథెరపీ సేవలు అందుతున్నాయి. ఒక ప్రమాదం లేదా చికిత్స తర్వాత, దీర్ఘకాలిక న్యూరో సమస్యలు, భవిష్యత్తు సమస్యల నివారణ, రోగులకు అవసర అవగాహన లాంటివి ఫిజియోథెరపీ వైద్య సేవల కిందికి వస్తాయి. ఫిజియోథెరపీస్టులు వాడే ప్రధాన టెక్నిక్స్‌లో బలాన్ని పెంచడం, శరీర సమతుల్యత – సమన్వయ వ్యాయామాలు, స్ట్రెచ్చింగ్, పోస్చర్ కరెక్షన్ వ్యాయామాలు, శ్వాస వ్యాయామాలు, మాన్యువల్ థెరపీ, లేజర్ థెరపీలు లాంటివి వస్తాయి. నేటి వైద్య విధానాల్లో ఫిజియోథెరపీ కూడా ఒక ముఖ్య భాగం అయ్యింది. అవసరం అయినపుడు ఫిజియోథెరపిస్టును సంప్రదించడం తప్పనిసరి అని తెలుసుకుందాం, తుది శ్వాస వరకు సంపూర్ణ ఆరోగ్యంతో స్వతంత్రంగా జీవిద్దాం. ఫిజియోథెరపిస్టులకు కృతజ్ఞతలు తెలియజేద్దాం.



-మధుపాళీ
9949700037

# ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహక పథకం... దరఖాస్తులపై స్పష్టతనిచ్చిన మంత్రిత్వ శాఖ

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 7:ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహానికి ఉద్దేశించిన రూ. 37,500 కోట్ల పథకానికి ఎలాంటి దరఖాస్తులు రాలేదని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో బొగ్గు మంత్రిత్వ శాఖ వాస్తవాలను వెల్లడించింది. అలాంటి వార్తలు కేవలం అనాలోచితమైనవని, అవి ఈ పథకం అసలు స్థితిని, దరఖాస్తు ప్రక్రియను ప్రతిబింబించవని మంత్రిత్వ శాఖ స్పష్టం చేస్తోంది.

మే 13, 2026న రూ. 37,500 కోట్ల మొత్తం ఆర్థిక వ్యయంతో ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహక పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దేశంలో బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ అభివృద్ధిని వేగవంతం చేయటం, సిన్‌గ్యాస్, మిథనాల్, అమ్మోనియా, యూరియాతో సహా అధిక-విలువ గల ఉత్పత్తులుగా దేశీయ బొగ్గు, లిగ్నైట్ మార్పిడిని ప్రోత్సహించటం ఈ పథకం ఉద్దేశం. ఇలాంటి విలువైన ఉత్పత్తుల తయారీకి దేశీయ వనరుల వినియోగాన్ని మరింత పెంచటం ద్వారా ముడి పదార్థాల దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించి... భారత ఇంధన, ఆర్థిక భద్రతను బలోపేతం చేసేందుకు ఈ పథకం దోహదపడుతుంది.

పథకానికి ఆమోదం లభించిన తర్వాత ప్రాజెక్టులను అభివృద్ధి చేసే అవకాశమున్న సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు బొగ్గు మంత్రిత్వ శాఖ నిరంతర ప్రచారం, భాగస్వాములతో సంప్రదింపులను నిర్వహించింది. ఇందులో భాగంగా న్యూఢిల్లీలో మే 28, 2026న, హైదరాబాద్‌లో జూన్ 11న, ముంబయిలో జూన్ 18, 2026న రోడ్‌షోలు జరిగాయి. ఈ కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు, సాంకేతిక పరిజ్ఞాన నిపుణులు, పెట్టుబడిదారులు, ఆర్థిక సంస్థలు, ఇతర భాగస్వాముల ప్రతినిధులను ఒకచోట చేర్చాయి. ఈ కార్యక్రమాలకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇది పథకంపై అవగాహన కల్పించటంలో, పరిశ్రమల భాగస్వామ్యాన్ని సులభతరం చేయటంలో ప్రభుత్వానికున్న నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

ఈ పథకం ద్వారా జూలై 7, 2026న ప్రతిపాదనలను కోరుతూ ఆహ్వాన పత్రం జారీ చేశారు. దరఖాస్తుల సమర్పణకు ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించారు. దరఖాస్తు చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులకు మరింత స్పష్టతను అందించేందుకు సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశాన్ని కల్పించటానికి జూలై 20, 2026న ముందస్తు దరఖాస్తు సమావేశాన్ని నిర్వహించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ సమావేశంలో పథకానికి సంబంధించిన వివిధ నిబంధనలు, అర్హతా ప్రమాణాలు, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన ప్రశ్నలపై స్పష్టతను కోరారు. ఆసక్తిగల భాగస్వాములు ఈ ప్రక్రియలో క్రియాశీలకంగా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు సంబంధిత వర్గాలతో మంత్రిత్వ శాఖ నిరంతరం చర్చలు జరుపుతూనే ఉంది.

దరఖాస్తులను సమర్పించేందుకు మొదటి విడత గడువు తేదీ 7 సెప్టెంబర్ 2026. కాబట్టి, ఈ దరఖాస్తుల ప్రక్రియ ముగిసే వరకు మొదటి విడతలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయనేది ఖచ్చితంగా అంచనా వేయటం, వెల్లడించటం సాధ్యం కాదు. మొదటి విడత దరఖాస్తు గడువు కొనసాగుతుండగానే... ఈ పథకానికి అసలు దరఖాస్తులే రాలేదని నిర్ధారణకు రావటం సరికాదు. అది వాస్తవ పరిస్థితిని తెలియజేయదు.

భాగస్వాములతో జరిగిన చర్చల ఆధారంగా తాల్చేర్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (టీఎఫ్ఎల్), ఎన్‌టీపీసీ లిమిటెడ్ దరఖాస్తులను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఇప్పటికే సమర్పించినట్లు మంత్రిత్వ శాఖకు సమాచారం అందింది. ఈ పథకానికి 'ఎవరూ స్పందించడం లేదు' అనే వాదన సరైనది కాదని దీని ద్వారా స్పష్టమవుతోంది. ప్రాజెక్టు తయారీ, దరఖాస్తు రూపకల్పన వివిధ దశల్లో ఉన్న ఇతర ఆసక్తి గల దరఖాసుదారులతో కూడా మంత్రిత్వ శాఖ సంప్రదింపులు జరుపుతోంది.

ఈ పథకం ద్వారా ఊహించిన ప్రాజెక్టుల భారీ పరిమాణం, సంక్లిష్టతను దృష్టిలో ఉంచుకుని, ముందుగా దరఖాస్తు చేసుకోవాలనుకునేవారు... ముందస్తు సాధ్యసాధ్యాల నివేదికల తయారీ, సాంకేతిక ప్రత్యామ్నాయాల అంచనా, బొగ్గు, లిగ్నైట్, ఇతర ముడిసరుకుల ఏర్పాట్ల గుర్తింపు, ప్రాజెక్టు ఆర్థిక వ్యవస్థను అంచనా వేయటంతో పాటు వివరణాత్మక ప్రాజెక్టు ప్రతిపాదనలను సిద్ధం చేయటం వంటి ముందస్తు తయారీ పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది. కాబట్టి గడువు సమీపిస్తున్న కొద్దీ మరికొంత మంది దరఖాస్తుదారులు ప్రతిపాదనలను ఖరారు చేసి సమర్పించే అవకాశం ఉంది.

ముఖ్యంగా ఈ పథకం ద్వారా పరిశ్రమలు పాల్గొనేలా పలు అవకాశాలు కల్పిస్తూ, దీన్ని రూపొందించారు. రోలింగ్ రౌండ్ విధానంలో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. ఒక రౌండ్ కోసం దరఖాస్తు గడువు ముగిసిన వెంటనే, తదుపరి రౌండ్ మరుసటి రోజే ప్రారంభమై రెండు నెలల పాటు దరఖాస్తుదారులకు అందుబాటులో ఉంటుంది. ప్రాజెక్టు తయారీకి అదనపు సమయం అవసరమయ్యే కంపెనీలు, కేవలం మునుపటి రౌండ్లలో పాల్గొనలేకపోయినంత మాత్రాన అనర్హులు కాకూడదనే ఉద్దేశంతో ఈ విధానాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున చేపట్టే బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు భారీ స్థాయిలో సన్నాహాలు, పెట్టుబడులు అవసరం అవుతాయి. అందుకే ఈ రోలింగ్-రౌండ్ విధానాన్ని పొందుపరిచారు.

ఈ పథకంలో పరిశ్రమల నుంచి బలమైన భాగస్వామ్యం ఉంటుందని మంత్రిత్వ శాఖ ధీమాతో ఉంది. ఈ పథకం దాదాపు 25 ప్రాజెక్టుల్లో సుమారు రూ. 2.5 లక్షల కోట్ల నుంచి రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుందని... సుమారు 50,000 ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని అంచనా. అలాగే 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు గ్యాసిఫికేషన్ సామర్థ్యాన్ని సాధించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ పథకం దోహదపడుతుంది.

ఈ పథకం అమలు ప్రారంభ దశలోనే ఉందని, మొదటి దశ దరఖాస్తు గడువు సెప్టెంబర్ 7, 2026 వరకు ఉంటుందని మంత్రిత్వ శాఖ మరోసారి స్పష్టం చేసింది. ప్రక్రియ కొనసాగుతుండగానే ఈ పథకానికి ఎవరూ స్పందించలేదనటం సరికాదు. ముందస్తు అంచనాల ఆధారంగా కాక, నిర్దేశిత దరఖాస్తు ప్రక్రియ, తదుపరి విడతలు పూర్తయిన తర్వాతే దీని విజయం, భాగస్వామ్య స్థాయిని అంచనా వేయాలి.

ఈ పథకానికి పరిశ్రమల నుంచి నిరంతర భాగస్వామ్యం లభిస్తుందని మంత్రిత్వ శాఖ విశ్వాసం వ్యక్తం చేస్తుంది. ఇది భారతదేశంలో బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ అభివృద్ధికి ఊతమిస్తుంది.

## ఘనంగా ముగిసిన తీజ్ ఉత్సవాలు



ఆదిలాబాద్, సెప్టెంబర్ 7:మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొనకల్‌లో బంజారా సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించిన తీజ్ ఉత్సవాలు ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. రాఖీ పౌర్ణమి సందర్భంగా సేవాలాల్ ఆలయం వద్ద ప్రారంభమైన ఈ ఉత్సవాలను బంజారా సోదర, సోదరీమణులు తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం బంజారా ఆడపడుచులు గోధుమల నారుతో పెంచిన తీజ్ బుట్టలను నెత్తిన పెట్టుకుని సంప్రదాయ పాటలు పాడుతూ, లయబద్ధంగా నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తరలి వెళ్లారు. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు చేసిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం తీజ్ బుట్టలను నిమజ్జనం చేశారు. ముందుగా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీర రేఖానాయక్, సుమన్ రాథోడ్, బీఆర్ఎస్ సెగ్మెంట్ ఇన్‌చార్జి బి. జాన్సన్ నాయక్, బంజారా సంఘం మండల అధ్యక్షుడు అజ్మీర భీమ్లాల్ నాయక్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. కార్యక్రమంలో నందు నాయక్, రాములు నాయక్, సందేశ్ నాయక్, పున్నం నాయక్, రాజ్యా, బిక్కు నాయక్, సాయి నాయక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు

# విద్యాపరమైన ప్రతిభ, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికవేత్తల సాధికారత దేశాభివృద్ధిలో ప్రాముఖ్యత గల అంశాలు: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 7:ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ రోజు (సెప్టెంబర్ 5, 2026) న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా పలువురు ఉపాధ్యాయులకు భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా ప్రసంగిస్తూ... మన రాజ్యాంగంలో పొందుపరిచిన సమాన అవకాశాల ఆదర్శాన్ని సాకారం చేసుకునేందుకు విద్యే అత్యంత ప్రభావవంతమైన సాధనమని గౌరవ రాష్ట్రపతి అన్నారు. ఉపాధ్యాయుల కృషితోనే ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు, మధ్యలోనే బడి మానేసే రేటు దాదాపు సున్నాకి చేరినట్లు ఆమె తెలిపారు. ఈ జాతీయ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలిపారు.

విద్యా వ్యవస్థకు పునాది పాఠశాల విద్యేనని రాష్ట్రపతి అన్నారు. జ్ఞానాన్ని, నైపుణ్యాలను ఎప్పుడైనా సంపాదించుకోవచ్చు. కానీ బాల్యంలోనే సత్ప్రవర్తనను నేర్పించటం మరింత ప్రభావవతంగా ఉంటుందని చెప్పారు. ప్రాథమిక తరగతుల్లో పిల్లల మేధో, శారీరక, నైతిక వికాసంపై దృష్టి సారించటం ద్వారా ఉపాధ్యాయులు... భవిష్యత్ తరాలను అత్యుత్తమ విద్యార్థులుగా, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దగలరని తెలిపారు.

చాలామంది విద్యార్థులు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వస్తారని, మరికొందరు మొదటి తరం అభ్యాసకులని, ఇంకొందరు సాధారణ గ్రామీణ పాఠశాలల నుంచి పెద్ద నగరాల పాఠశాలలకు మారుతుంటారని, కొందరు స్వతహాగా బిడియంతో ఉంటారని, మరికొందరికి అపారమైన ప్రతిభ ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసం లోపిసుందని, కొందరు ప్రత్యేక అవసరాలు గల పిల్లలుంటారని రాష్ట్రపతి అన్నారు. కారణం ఏదైనా... ఆత్మన్యూనతతో బాధపడే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ముందుకు నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. విద్యాపరమైన ప్రతిభ, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామి కవేత్తల సాధికారత దేశాభివృద్ధిలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశాలని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రపంచ నైపుణ్య రాజధానిగా భారత్‌ను తీర్చిదిద్దటం, విజ్ఞాన కేంద్రంగా మార్చటం మన జాతీయ ప్రాధాన్యతల్లో ఒకటని స్పష్టం చేశారు.

# క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యక్రమాలతో పిల్లల్లో స్క్రీన్ సమయాన్ని తగ్గించాలి: ప్రధాని

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 7:లోక్ కల్యాణ్ మార్గ్‌లోని తన నివాసంలో జాతీయ ఉపాధ్యాయ పురస్కార విజేతలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న సమావేశమయ్యారు.

ఈ ఏడాది మూడు విభాగాలకు చెందిన మొత్తం 82 మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలను జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక చేశారు. వీరిలో పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగానికి చెందిన 48 మంది ఉపాధ్యాయులు, ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్‌లకు చెందిన 21 మంది ఉపాధ్యాయులు/ఫ్యాకల్టీ సభ్యులు, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వశాఖకు చెందిన 13 మంది నైపుణ్య శిక్షకులు ఉన్నారు. తమ బోధన ప్రస్థానాన్ని తీర్చిదిద్దిన అనుభవాలు, ఆవిష్కరణలను పురస్కార గ్రహీతలు వివరించారు. తరగతి గది అభ్యాసాన్ని మరింత ఆసక్తికరంగా, ప్రభావవంతంగా మార్చేందుకు తాము అనుసరించిన పలు సృజనాత్మక విధానాలను వారు పంచుకున్నారు.

పిల్లల విద్యా ప్రదర్శనను మాత్రమే కాకుండా, వారి ప్రవర్తన, రోజువారీ జీవితాన్ని కూడా ఉపాధ్యాయులు గమనించాలని ప్రధానమంత్రి చెప్పారు. సంప్రదాయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ తగ్గిపోతున్న నేపథ్యంలో పిల్లల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర మరింత కీలకంగా మారిందని ఆయన అన్నారు. మాదకద్రవ్యాల సమస్యను ప్రస్తావిస్తూ.. పిల్లల్లో వచ్చే మార్పులపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని, వాటికి గల కారణాలను గుర్తించి, అలాంటి పిల్లలు ఆ అలవాటును అధిగమించేందుకు సహాయం చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు.

బాల్యంలోని అమాయకత్వాన్ని కాపాడటం ఉపాధ్యాయులు పోషించగల కీలక పాత్ర అని ప్రధానమంత్రి అన్నారు. పిల్లలందరిలోనూ సహజమైన ఆసక్తి, జిజ్ఞాస ఒకే విధంగా ఉంటాయని, ఉపాధ్యాయులు ఆ ఉత్సుకతను ప్రోత్సహించి, సరైన దిశలో నడిపిస్తే వారి అభివృద్ధికి గణనీయమైన తోడ్పాటు అందించగలరని ఆయన పేర్కొన్నారు.

స్క్రీన్ టైమ్ సమస్యను ప్రస్తావిస్తూ.. ఇది ప్రస్తుతం ప్రధాన ఆందోళనగా మారిందని ప్రధానమంత్రి అన్నారు. పిల్లలు ఎంత సమయం స్క్రీన్‌లను చూస్తున్నారు, రాత్రి వేళల్లోనూ మొబైల్ ఫోన్లను వినియోగిస్తున్నారా అనే అంశాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడాలని ఆయన సూచించారు.

క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యక్రమాలపై ఆసక్తిని పెంపొందించడం ద్వారా పిల్లలు క్రమంగా అధిక స్క్రీన్ వినియోగం నుంచి బయటపడేలా చేయవచ్చని ఆయన అన్నారు.

జాతీయ విద్యా విధానాన్ని ప్రస్తావించిన ప్రధానమంత్రి.. పిల్లలను తరగతి గది నుంచి బయటకి తీసుకెళ్లి, వాస్తవ ప్రపంచ నైపుణ్యాలు, వివిధ రకాల పనులతో వారిని అనుసంధానించడం ప్రాధాన్యమని పేర్కొన్నారు. పాఠ్యాంశంలోని జ్ఞానాన్ని బోధించడానికే పరిమితం కాకుండా, పిల్లల్లో శ్రమకు గౌరవం వంటి విలువలను పెంపొందించేందుకు కూడా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు.

## కడెంలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఆదిలాబాద్, సెప్టెంబర్ 7:సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని కడెం మండల ఇన్‌చార్జి ఎంఈవో వి. రమేష్, పెద్దూరు-కడెం గ్రామ సర్పంచ్ దీకొండ విజయ్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కడెం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 15 మంది ఉపాధ్యాయులు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు ఎంపికయ్యారు. అంబారిపేట జెడ్పీఎస్ఎస్ పాఠశాల ఎస్ఏ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు జి. ప్రేమ్‌దాస్, కడెం జెడ్పీఎస్ఎస్ ఎస్ఏ గణితం ఎం. మహేష్‌కుమార్, పాత మద్దిపడగ జెడ్పీఎస్ఎస్ ఎస్ఏ సోషల్ సీహెచ్. నరేష్‌కుమార్, కొర్రతండా ఎంపీపీఎస్ ఎస్‌జీటీ ఎం. దామోదర్, కల్లెడ ఎంపీయూపీఎస్ ఎస్‌జీటీ డి. సుమలత, అంబారిపేట ఎంపీపీఎస్ ఎస్‌జీటీ సీహెచ్. సందీప్, చిట్యాల ఎంపీయూపీఎస్ ఎస్‌జీటీ రమేష్, దిల్దార్‌నగర్ ఎంపీపీఎస్ ఎస్‌జీటీ వి. వినయ్‌కుమార్, మాసాయిపేట ఎంపీయూపీఎస్ ఎస్‌జీటీ డి. గిరిజ, కొత్త మద్దిపడగ ఎంపీపీఎస్ ఎస్‌జీటీ జి. దీపిక, మొర్రిగూడ ఎంపీపీఎస్ ఎస్‌జీటీ సుద్దాల రాజేశ్వర్, కొత్త మద్దిపడగ ఎంపీయూపీఎస్ ఎస్ఏ సోషల్ ఎస్. కిషోర్ తదితరులు అవార్డులకు ఎంపికయ్యారు.

అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులను మండల ఇన్‌చార్జి ఎంఈవో వి. రమేష్, సర్పంచ్ దీకొండ విజయ్‌కుమార్, ఉపసర్పంచ్ పిట్టల రాజన్న, తహసీల్దార్ ఖాజా మొయినుద్దీన్, లింగాపూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం బి. వెంకటరమణ, పాత మద్దిపడగ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం దశరథ్, పీఆర్‌టీయూ కడెం మండల అధ్యక్షుడు బొమ్మిడి మహేశ్వర్, ప్రధాన కార్యదర్శి బి. వెంకటరమణ, ఎస్సీ, ఎస్టీ టీచర్స్ యూనియన్ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీ. క్రాంతికుమార్ తదితరులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, లింగాపూర్ జెడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి పర్యటనలో భట్టి..



కరీంనగర్, సెప్టెంబర్ 7:ధర్మపురి పర్యటనలో భాగంగా ధర్మారం క్రాస్‌రోడ్డు వద్ద ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి వచ్చిన భట్టి విక్రమార్కకు రాత్రి వేళలోనూ పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలు చూపిన అభిమానం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని ఆయన తెలిపారు.

ధర్మపురిలోని శ్రీ ఉగ్ర నరసింహా స్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులకు ఆదివారం వేకువజామున 2:48 గంటలకు భూమిపూజ నిర్వహించనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆలయ పునర్నిర్మాణంతో ధర్మపురి ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని మరింత పెంచేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

న్ని ఇబ్బందులు ఎదురైనా పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు.

# పంజాబ్ విద్యుదుత్పత్తి కేంద్రాలకు తగినంత బొగ్గు: క్యాప్టివ్ గనుల్లో పీఎస్‌పీసీఎల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:పంజాబ్ రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి తగ్గడానికి కేంద్రం నుంచి సరివడా బొగ్గు సరఫరా కాకపోవడమే కారణమంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదు. పంజాబ్ విద్యుత్ కేంద్రాలకు సరిపడినంత బొగ్గు అందుబాటులో ఉంచినట్లు బొగ్గు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పంజాబ్‌తో సహా దేశవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తి కోసం నిరంతరాయంగా బొగ్గును సరఫరా చేసేందుకు కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) కట్టుబడి ఉందని తెలియజేసింది.

పంజాబ్‌లో క్యాప్టివ్ గనుల నుంచి ఉత్పత్తి ప్రారంభమైనప్పటి నుంచే అక్కడి స్వతంత్ర విద్యుత్ కేంద్రాలకు (ఐపీపీ) బొగ్గు రవాణాను సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుంది.

జార్ఖండ్‌కు చెల్లించాల్సిన చట్టబద్ధమైన బకాయిలను చెల్లించే షరతుతో పీఎస్‌పీసీఎల్‌కు చెందిన పచ్వారా కేంద్ర క్యాప్టివ్ బొగ్గు గని నుంచి ఐపీపీలకు బొగ్గు సరఫరాకు అనుమతినిచ్చింది.

నిర్దేశిత తుది వినియోగ ప్లాంట్ల అవసరాలు తీరిన అనంతరం? నభా పవర్ లిమిటెడ్ (రాజ్‌పుర), తల్వాండి సబూ పవర్ లిమిటెడ్ (మన్సా) లాంటి వాటితో సహా పీఎస్‌పీసీఎల్ యాజమాన్యంలో లేని ఐపీపీలకు వార్షిక ఉత్పత్తిలో 50 శాతం వరకు బొగ్గును వాడుకునేందుకు ఇప్పటికే అనుమతి ఉంది. 50 శాతానికి మించి బొగ్గు అవసరమైన సందర్భాల్లో పీఎస్‌పీసీఎల్ కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించవచ్చు.

పంజాబ్‌కు కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) మద్దతు, పీఎస్‌పీసీఎల్ కేంద్రాల్లో తక్కువ పీఎల్ఎఫ్ (42 శాతం)

మూడు థర్మల్ విద్యుత్ కేంద్రాలను పీఎస్‌పీసీఎల్ నిర్వహిస్తోంది. అవి గురు హర్ గోవింద్ టీపీఎస్ (లెహ్రా మొహబ్బత్), గోయింద్వాల్ సాహిబ్ టీపీపీ, రోపర్ టీపీఎస్. వీటి మొత్తం సామర్థ్యం 2,300 మెగా వాట్లు. 04.09.2026 నాటికి సాధారణ అవసరాలతో పోలిస్తే.. సుమారు 117 శాతం అధికంగా బొగ్గు నిల్వలున్నాయి. తగినంత బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ ఆగస్టు 2026లో ఈ విద్యుత్ కేంద్రాల సగటు ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) 42 శాతం మాత్రమే నమోదయింది. ఈ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి తగ్గడానికి బొగ్గు కొరతే కారణమని చెప్పలేం.

దీనికి భిన్నంగా అదే కాల వ్యవధిలో పంజాబ్‌కు చెందిన ఐపీపీ నభా పవర్ లిమిటెడ్ దాదాపు 93 శాతం పీఎల్ఎఫ్‌ను నమోదు చేసింది. సీఐఎల్ వనరుల నుంచి సరిపడినంత బొగ్గు సరఫరా అవడంతో ఇది సాధ్యమైంది. రాష్ట్రంలో విద్యుదుత్పత్తికి బొగ్గు కొరత అడ్డంకి కాదని ఈ ఉదాహరణ తెలియజేస్తోంది.

సీఐఎల్ ఇప్పటికే అందించిన బొగ్గు తరలింపును ఐపీపీలు మెరుగుపరచాల్సిన అవసరం ఉందిపంజాబ్ ఆధారిత ఐపీపీలకు కోల్ ఇండియా అనుబంధ సంస్థలు బొగ్గును అందించినప్పటికీ బుకింగ్, తరలింపు ప్రక్రియ మందకొడిగా ఉంది.

ఆర్‌సీఆర్ విధానం ద్వారా 30.03.2026న ఎన్‌పీఎల్, టీఎస్‌పీఎల్‌కు అయిదు లక్షల టన్నుల (ఎల్‌టీ) బొగ్గును కేటాయించింది. ఇందులో ఇప్పటివరకు దాదాపు 4.1 లక్షల టన్నులు మాత్రమే బుక్ చేసుకోగా, సుమారు 3.1 లక్షల టన్నుల బొగ్గును తరలించారు.

ఎన్‌పీఎల్‌కు 3.5 ఎల్‌టీల బొగ్గును బీసీసీఎల్ కేటాయించింది. అందులో సుమారు 1.3 ఎల్‌టీల బొగ్గును మాత్రమే బుక్ అయింది. ఇప్పటి వరకు 0.98 ఎల్‌టీల బొగ్గును తరలించారు.

పంజాబ్‌లో విద్యుదుత్పత్తిని పెంచడంలో సమయానికి ఐపీపీలు బొగ్గును తరలించడానికీ, తన పరిధిలోని ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పీఎస్‌పీసీఎల్ మెరుగుపరుచుకోవడానికీ సమ ప్రాధాన్యముంది.

పంజాబ్‌లోని ఐపీపీలకు బొగ్గు రవాణాను సులభతరం చేయడానికి, పీఎస్‌పీసీఎల్ క్యాప్టివ్ గనుల నుంచి సరఫరాను అనుమతించేందుకు చట్టబద్ధమైన తుది వినియోగ పరిమితులను సడలించడంతో సహా, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పటిష్టమైన చర్యలు తీసుకుందని బొగ్గు మంత్రిత్వ శాఖ పునరుద్ఘాటిస్తోంది. పంజాబ్‌తో సహా దేశవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తి కోసం నిరంతరాయంగా బొగ్గు సరఫరాను కొనసాగించడానికి కోల్ ఇండియా లిమిటెడ్ కట్టుబడి ఉంది. పీఎస్‌పీసీఎల్ సొంత ప్లాంట్లను గరిష్ఠ స్థాయిలో వినియోగించుకోవడం, ఇప్పటికే సీఐఎల్ అనుబంధ సంస్థలు కేటాయించిన బొగ్గును సకాలంలో తరలించడం ద్వారా విద్యుత్ ఉత్పత్తిని మెరుగుపరిచి, రాష్ట్ర విద్యుత్ అవసరాలకు వాడుకోవచ్చును.

# పీఐబీ హైదరాబాద్ ఆధ్వర్యంలో గుజరాత్‌లో పర్యటిస్తున్న తెలంగాణ మీడియా బృందం



హైదరాబాద్, సెప్టెంబర్ 7:హైదరాబాద్ పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) ఆధ్వర్యంలో తెలంగాణకు చెందిన 10 మంది పాత్రికేయుల బృందం గుజరాత్ రాష్ట్రంలో పర్యటిస్తోంది. సెప్టెంబర్ 6 నుంచి 12 వరకు వారం రోజులపాటు కొనసాగే ఈ పర్యటనకు మీడియా కమ్యూనికేషన్ అధికారి (ఎమ్ అండ్ సీవో) శ్రీమతి వర్గంటి గాయత్రి నేతృత్వం వహిస్తున్నారు. ఈ రోజు అహ్మదాబాద్ చేరుకున్న ఈ బృందానికి పీఐబీ అధికారులు స్వాగతం పలికారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన సమాచారాన్ని విలేకరుల ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడం, రాష్ట్రాల మధ్య అభివృద్ధి అనుభవాలను పరస్పరం పంచుకోవడమే ఈ పర్యటన ప్రధానోద్దేశం. గుజరాత్‌లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు, వివిధ రంగాల్లో సాధించిన విజయాలను ప్రత్యక్షంగా పరిశీలించే వీలును పాత్రికేయులకు అందించడం ఈ పర్యటన లక్ష్యంగా ఉంది. ఈ పర్యటనలో భాగంగా సబర్మతీ రివర్ ఫ్రంట్, ధోలేరా ప్రత్యేక పెట్టుబడుల ప్రాంతం (ధోలేరా ఎస్ఐఆర్), గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్– సిటీ (గిఫ్ట్ సిటీ), అమూల్ డెయిరీ, ఐక్యతా మూర్తి, సర్దార్ సరోవర్ ఆనకట్ట, తదితర ముఖ్యమైన ప్రాజెక్టులు, సంస్థలను విలేకరుల బృందం సందర్శిస్తుంది. సీఈపీటీ విశ్వవిద్యాలయం, జాతీయ ఫోరెన్సిక్ సైన్సెస్ విశ్వవిద్యా లయం, సబర్మతీ మల్టీ మోడల్ హబ్‌లను కూడా వారు సందర్శిస్తారు. అధికారులు, ఇతర భాగస్వాములతో సమావేశమవుతారు.

# శ్రీలంకలో మూడు రోజులు పర్యటించనున్న రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ 2026 సెప్టెంబర్ 08 నుంచి 10 వరకు మూడు రోజులపాటు శ్రీలంకలో పర్యటించనున్నారు. ఈ అధికార పర్యటనలో భాగంగా కీలక అంశాలపై శ్రీలంక అగ్రనాయకత్వంతో జరిగే ద్వైపాక్షిక చర్చల్లో ఆయన పాల్గొంటారు. కొలంబోలోని భారతీయ సమాజంతో ముఖాముఖి సంభాషిస్తారు. రక్షణ మంత్రిత్వ శాఖ, విదేశాంగ మంత్రిత్వ శాఖలకు చెందిన సీనియర్ అధికారులతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో ఆయన శ్రీలంక వెళతారు.

భారత్, శ్రీలంక దేశాలు నాగరికతా సంబంధాలను, బహుముఖ భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నాయి. ప్రాంతీయ భద్రత, రక్షణ, ఆర్థిక, వాణిజ్య సహకారంతో పాటు ప్రజల మధ్య బలమైన సంబంధాలు ఈ భాగస్వామ్యానికి ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి. శ్రీలంకకు ఆర్థిక సంక్షోభ సమయంలో భారత్ అండగా నిలవడం, 2025లో శ్రీలంకలో సంభవించిన 'దిత్వా' తుపాను అనంతరం తొలి స్పందన దేశాల్లో ఒకటిగా భారత్ సహాయ సహకారాలు అందించడం ద్వారా ద్వైపాక్షిక సంబంధాలకు మరింత ఊతం లభించింది. 'పొరుగు దేశాలకు మొదటి ప్రాధాన్యం' విధానంపై భారత్ కొనసాగిస్తున్న నిబద్ధతను, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రతిపాదించిన మహాసాగర్ (ప్రాంతాల మధ్య భద్రత, అభివృద్ధి కోసం పరస్పర, సమగ్ర పురోగతి) దార్శనికతకు ఇస్తున్న ప్రాధాన్యతను ఇది స్పష్టంగా చాటిచెప్పింది.

రక్షణ మంత్రి శ్రీలంక పర్యటన ఇరు దేశాలకు పరస్పరం ప్రయోజనకరమైన రంగాలతో పాటు బలమైన సముద్ర తీర

# కష్ట సమయంలో కుటుంబమంతా ఒక్కటిగా నిలిచే స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్న 'సీఎస్ఎస్ షీల్డ్': డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:ఉద్యోగులు, వారి కుటుంబాల అవసరాలకు మరింత అనుగుణంగా సేవా నిబంధనలను మార్చేందుకు నిరంతర కృషి అవసరమని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ), సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ నేడు పిలుపునిచ్చారు.

కేంద్ర సచివాలయ సేవల (సీఎస్ఎస్) ఫోరం చేపట్టిన 'సీసీఎస్ షీల్డ్' కార్యక్రమాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ స్వాగతించారు. ఇలాంటి సమష్టి ప్రయత్నాలు ఆకస్మిక విషాద సమయంలో కుటుంబాలకు అండగా నిలిచే కొత్త సంస్కృతికి నాంది పలుకుతాయని అన్నారు.

ఈ కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. ఈ విధానాన్ని అమలు చేయడం కష్టమేమీ కాదని, అయితే అందుకు సమష్టి సంకల్పం, సహకరించాలనే సుముఖత ముఖ్యమని పేర్కొన్నారు. సహచరులు ఒక కుటుంబంలా కలిసి దుఃఖంలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచినప్పుడు, అది సంస్థకు మించి ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుందని ఆయన అన్నారు.

మరణించిన సీఎస్ఎస్ అధికారుల కుటుంబాలకు పరస్పర సహకారం అందించేందుకు కేంద్ర సచివాలయ సేవల ఫోరం 'సీఎస్ఎస్ షీల్డ్' పేరుతో చేపట్టిన కార్యక్రమ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సీఎస్ఎస్ ఫోరం కార్యనిర్వాహకులు, సభ్యులు, విధుల్లో ఉన్న సీఎస్ఎస్ అధికారులు, సహచరులతో పాటు దివంగత శ్రీ మోహన్ చంద్ర భట్, దివంగత శ్రీ రాజేంద్ర చంద్ర కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా మరణించిన ఇద్దరు అధికారుల కుటుంబాలకు డాక్టర్ జితేంద్ర సింగ్ ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఉద్యోగులు, వారి కుటుంబాల అవసరాలకు ప్రభుత్వ సేవా వ్యవస్థలను మరింత స్పందించేలా మార్చేందుకు కేంద్ర సిబ్బంది మంత్రిత్వ శాఖ చేస్తున్న విస్తృత కృషిలో భాగంగానే ఈ కార్యక్రమం చేపట్టినట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. సమకాలీన అవసరాలకు అనుగుణంగా ఇటీవలి సంవత్సరాల్లో అనేక సేవల సంబంధిత నిబంధనల్లో మార్పులు చేశామని ఆయన అన్నారు. వ్యవస్థను మరింత స్పందించేలా చేయగలిగే చోట కొత్త నిబంధనలను ప్రవేశపెట్టడానికి లేదా ప్రస్తుత నిబంధనలను సవరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ విధానాన్ని ప్రస్తావిస్తూ డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడారు. నిబంధనలు, విధానాలను నిరంతరం సమీక్షించి, ప్రస్తుత వ్యవస్థలను మరింత మెరుగుపరచగలిగే చోట అవసరమైన మార్పులు చేయాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు.

ఉద్యోగులు, వారి కుటుంబాల అవసరాలకు ప్రభుత్వ వ్యవస్థలు సున్నితంగా, స్పందించేలా ఉండేలా చూడటమే దీని లక్ష్యమని తెలిపారు.

సీఎస్ఎస్ షీల్డ్ కార్యక్రమంలో భాగస్వామ్యం, నిధుల సమీకరణ పెరిగే కొద్దీ ఈ కార్యక్రమం మరింత విస్తృత రూపాన్ని సంతరించుకోవచ్చని మంత్రి సూచించారు. మరణించిన సీఎస్ఎస్ అధికారుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందించడాన్ని కూడా ఈ కార్యక్రమం ద్వారా అందించే సహాయంలో భాగంగా పరిగణించవచ్చని ఆయన అన్నారు. తద్వారా విషాదం సంభవించిన తర్వాత కూడా కుటుంబాలకు ఆసరా లభిస్తుందని పేర్కొన్నారు.

"కుటుంబం కోసం సహకరించండి, గౌరవంతో అండగా నిలవండి" అనే సూత్రం ఆధారంగా సీఎస్ఎస్ షీల్డ్ కార్యక్రమాన్ని రూపొందించారు. సీఎస్ఎస్ అధికారుల మృతితో విషాదంలో ఉన్న కుటుంబాలకు సమిష్టిగా ఆర్థిక సహాయం అందించడమే దీని లక్ష్యం. సేవా సమాజంలోని సభ్యులు తమ సహచరుల కుటుంబాలకు అండగా నిలిచేలా మరింత క్రమబద్ధమైన, విశ్వసనీయమైన వ్యవస్థను ఏర్పాటు చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశం.

ఈ కార్యక్రమం రూపుదిద్దుకున్న తీరును వివరిస్తూ సీఎస్ఎస్ ఫోరం ప్రతినిధులు మాట్లాడారు. సీఎస్ఎస్ షీల్డ్ అధికారికంగా ప్రారంభించక ముందే మరణించిన సీఎస్ఎస్ అధికారుల కుటుంబాలకు స్వచ్ఛంద విరాళాల ద్వారా ఫోరం సహాయం అందిస్తూ వచ్చిందని తెలిపారు. కోవిడ్ 19 కాలంలో పలువురు సీఎస్ఎస్ అధికారులు ప్రాణాలు కోల్పోయిన సమయంలో ఎదురైన అనుభవాలు, పరస్పర సహకారానికి ఒక క్రమబద్ధమైన వ్యవస్థ అవసరాన్ని మరింత బలపరిచాయని వారు పేర్కొన్నారు. 2020 నుంచి సుమారు 65 నుంచి 70 మంది మరణించిన అధికారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు సీఎస్ఎస్ అధికారులు సమష్టిగా సుమారు రూ.1.30 కోట్లను విరాళంగా అందించారని ఫోరం తెలిపింది. ఈ సహాయంలో మరింత స్థిరత్వం, ముందస్తు అంచనా ఉండేలా చేయడానికి ఇప్పుడు సీఎస్ఎస్ షీల్డ్ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.

కొత్త కార్యక్రమం కింద విషాదంలో ఉన్న ప్రతి కుటుంబానికి కనీసం రూ.15 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ఫోరం లక్ష్యంగా పెట్టుకుంది. కార్యక్రమంలో భాగస్వామ్యం పెరిగే కొద్దీ ఈ సహాయాన్ని క్రమంగా మరింత పెంచడం దీని విస్తృత లక్ష్యంగా ఉంది. కేంద్ర సచివాలయ సేవలకు చెందిన సుమారు 13,000 మంది సభ్యులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడంతో, భవిష్యత్తులో అందించే సహాయాన్ని గణనీయంగా పెంచాలని ఫోరం భావిస్తోంది.

ఈ కార్యక్రమంలో దివంగత శ్రీ మోహన్ చంద్ర భట్, దివంగత శ్రీ రాజేంద్ర చంద్రలకు నివాళులర్పించారు. వారి సేవలను, అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. శ్రీ భట్ కేంద్ర సచివాలయ సేవలు, ఇతర ప్రభుత్వ సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. శ్రీ రాజేంద్ర చంద్ర ఆదాయ శాఖ పరిపాలనా విభాగంలో సుమారు రెండు దశాబ్దాల పాటు సేవలందించారు.సీఎస్ఎస్ షీల్డ్ కార్యక్రమం ప్రారంభంతో కష్ట పరిస్థితుల్లో తన సభ్యులకు, వారి కుటుంబాలకు అండగా నిలవడం, "కలిసి సేవ చేస్తాం, కలిసి సహకరిస్తాం" అనే స్ఫూర్తిని మరింత బలోపేతం చేయడం పట్ల సీఎస్ఎస్ ఫోరం తన నిబద్ధతను ప్రకటించింది.

# ఫీజుల బకాయిలు వెంటనే విడుదల చేయాలి



నిజామాబాద్, సెప్టెంబర్ 7:విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న బీజేవైఎం పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బీజేపీ నాయకుడు సంతోష్ కుమార్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ముప్కాల్ మండల కేంద్రం నుంచి అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులను అణచివేయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. విద్యార్థుల సమస్యలపై బీజేపీ చేస్తున్న పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఫీజుల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# ఫీజు బకాయిలపై బీజేపీ లడాయి..
# వలిగొండ నేతల ముందస్తు అరెస్టు



నల్గొండ, సెప్టెంబర్ 7: ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారని మండల పార్టీ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని బీజేపీ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం కుట్రపూరిత రాజకీయాలకు నిదర్శనమని ఆయన ఆరోపించారు. అరెస్టులతో బీజేపీ చేపడుతున్న ప్రజా పోరాటాలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలపై బీజేపీ పోరాటం కొనసాగుతుందని బోళ్ల సుదర్శన్ తెలిపారు. రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి వచ్చి సుపరిపాలన అందిస్తుందని అన్నారు. ముందస్తుగా అరెస్టయిన వారిలో బీజేపీ జిల్లా నాయకులు బంధారపు లింగస్వామి, కనతాల అశోక్‌రెడ్డి, రాచకొండ కృష్ణ, వైసొల్ల రామనర్సు, మండల నాయకులు మందుల నాగరాజు, బుంగమట్ల చిన్న మహేష్, పోలు నాగయ్య, సంకబుడ్డి హరికృష్ణ తదితరులు ఉన్నారని పేర్కొన్నారు.

# ముప్కాల్‌లో పైప్‌లైన్ లీకేజీ.. రోడ్డుపై పారుతున్న నీరు

నిజామాబాద్, సెప్టెంబర్ 7: ముప్కాల్ మండలం వెంచిర్యాల గ్రామంలోని ప్రధాన రహదారిపై పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంచిర్యాల నుంచి మెండోరా మండలం వెల్గటూర్‌కు నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో నీరు నిలిచి రహదారి దెబ్బతింటుండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యను ఇప్పటికే స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు.

మిషన్ భగీరథ, గ్రిడ్ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే పైప్‌లైన్ లీకేజీ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నీరు రోడ్డుపై ప్రవహిస్తూ రహదారి పరిస్థితిని మరింత దెబ్బతీస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారులు వెంటనే స్పందించి లీకేజీని అరికట్టాలని గ్రామ సర్పంచ్ నిమ్మల రాజమణి–శ్రీనివాస్ కోరారు.

# వృద్ధురాలి చెవులు కోసి కమ్మలు చోరీ

**అర్ధరాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న 70 ఏళ్ల మహిళపై దాడి**

**కత్తెరతో చెవులు కోసి కమ్మలు అపహరణ.. నిందితుడి కోసం పోలీసుల గాలింపు**

**బాధితురాలికి ఆసుపత్రిలో చికిత్స.. అదే కాలనీకి చెందిన వ్యక్తిపై అనుమానాలు**

నిజామాబాద్, సెప్టెంబర్ 7: నిజామాబాద్ నగరంలోని గౌతమ్‌నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న 70 ఏళ్ల అరుంధతిపై ఓ వ్యక్తి దాడికి తెగబడ్డాడు. కత్తెరతో ఆమె చెవులు కోసి, చెవులకు ఉన్న కమ్మలను అపహరించుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

దాడిలో తీవ్రంగా గాయపడిన అరుంధతిని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మూడో టౌన్ ఎస్సై హరిబాబు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు అదే కాలనీకి చెందిన వ్యక్తి అయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, నిందితుడిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే దీనిపై పోలీసులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

# కారును ఢీకొన్న డీసీఎం.. ఇద్దరు మృతి

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7:మండల శివారులోని జాతీయ రహదారి 44పై ఫ్లైఓవర్‌లో సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కర్నూలు వైపు వెళు న్న కోళ్ల లోడ్‌తో ఉన్న డీసీఎం అదుపుతప్పి కారును ఢీకొనడంతో కారు తీవ్రంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న హరీష్‌గౌడ్ (26), డీసీఎం డ్రైవర్ గుజ్జాల శేఖర్ (30) తీవ్రంగా గాయపడి మృతి చెందారు. కారులో ఉన్న హరీష్‌గౌడ్ భార్య కళ్యాణికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

సమాచారం అందుకున్న భూత్పూర్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

ప్రమాదంలో మృతి చెందిన వారి వివరాలను సేకరించి, మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలి

**శాంతిభద్రతలు, ప్రజల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.**
**-జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**




ములుగు, సెప్టెంబర్ 7:(నేటినిజం ప్రతినిధి): వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వినాయక మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి అనుమతి పొందాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేని వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు పొందిన తర్వాతే మండపాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

మండపాల వద్ద జూదం, అభ్యంతరకర ప్రసంగాలు, అవాంఛనీయ కార్యకలాపాలకు తావివ్వకుండా భక్తి కార్యక్రమాలు మాత్రమే నిర్వహించాలని తెలిపారు. మసీదులు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాల సమీపంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రార్థనా సమయాల్లో మసీదుల సమీపంలోని మండపాల నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని కలెక్టర్ సూచించారు. డీజేలకు అనుమతి లేదని, మండపాల వద్ద భక్తిగీతాలను మాత్రమే వినిపించాలని స్పష్టం చేశారు.

ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

మండపాల వద్ద విద్యుత్ తీగలు, స్విచ్ బోర్డులు, దీపాలను సురక్షితంగా ఏర్పాటు చేయాలని, విద్యుత్ కనెక్షన్ల కోసం ముందుగానే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

ప్రమాదాలకు తావులేకుండా నాణ్యమైన విద్యుత్ పరికరాలను వినియోగించాలని తెలిపారు. పురపాలక, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, తాగునీరు తదితర ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.

మండల స్థాయిలో తహసీల్దార్లు పంచాయతీ కార్యదర్శులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి అవసరమైన ఏర్పాట్లపై కార్యాచరణ రూపొందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీవో కృష్ణవేణి, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కురవి హాస్టల్.. ప్రభుత్వ భూముల కబ్జాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**ఎస్సీ బాలికల వసతిగృహాన్ని మౌలిక వసతులున్న భవనంలోకి మార్చాలి**



వరంగల్, సెప్టెంబర్ 7: కురవి మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని విద్యార్థినులకు అవసరమైన మౌలిక వసతులు, భద్రతా సదుపాయాలు ఉన్న భవనంలోకి మార్చాలని కోరుతూ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీషకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దళిత అవార్డు గ్రహీత దైద భద్రయ్య, కురవి మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు నూతకి సాంబశివరావు, సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత కిన్నెర మల్లయ్య, మాజీ వార్డు సభ్యుడు ఇరుగు వెంకన్న వినతిపత్రం సమర్పించారు. విద్యార్థినుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని హాస్టల్‌ను అనువైన భవనంలోకి తరలించాలని వారు కోరారు.

కురవి మండల కేంద్రంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఆక్రమణలకు గురవుతున్న నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టి, అక్రమ కబ్జాలు ఉన్నట్లయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు. ముఖ్యంగా సర్వే నంబర్ 177లోని ప్రభుత్వ భూములకు ప్రత్యేక సర్వేయర్లను కేటాయించి హద్దులు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ భూములను పరిరక్షించడంతో పాటు అవి అక్రమంగా చేతులు మారకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

# క్రీడల అభివృద్ధిపై సింగరేణి ప్రత్యేక దృష్టి

కరీంనగర్, సెప్టెంబర్ 7:సింగరేణి సంస్థ క్రీడల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎస్‌ఓటు జీఎం చంద్రశేఖర్ అన్నారు. రామగుండం ఏరియా-1 వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో 2026?27 సంవత్సరానికి సంబంధించిన అంతర్ విభాగ క్రీడా పోటీలు సోమవారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు సంస్థ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని గనులు, విభాగాలకు చెందిన ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. సెప్టెంబరు 7 నుంచి 20వ తేదీ వరకు వివిధ విభాగాల మధ్య అంతర్ విభాగ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు దామర శంకర్‌ను

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం.. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

**1000 రోజుల పాలనలో కాంగ్రెస్ చేసిందేమీ లేదు.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

వరంగల్, సెప్టెంబర్ 7: ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో సాధించింది శూన్యమని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను నిలిపివేయడం, ఇప్పటికే టెండర్లు పూర్తయిన పనులను కూడా ఆపేయడం సరికాదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రానున్న రోజుల్లో ప్రజలు గద్దె దించడం ఖాయమని అన్నారు.

హామీలను అమలు చేయకుండా ప్రజల్లోకి వస్తే కాంగ్రెస్ పాలకులను ప్రజలు నిలదీసే పరిస్థితి వస్తుందని ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తామని చెబుతున్నారని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ఎదుట నిరసన చేపట్టిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పసుమర్తి సీతారాములు, నల్లమాస ప్రమోద్, ప్రదీప్‌రెడ్డి, బిందు శ్రీనివాస్, కుర్ర శ్రీనివాస్, అంకుష్, కాలు నాయక్, రాయిశెట్టి వెంకన్న, జైసింగ్ నాయక్, కర్నె నాగరాజు, తూర్పాటి రవి, పేర్ల జంపన్న, భవానీలత, బొజ్యా నాయక్, స్వామి నాయక్, గుగులోత్ శంకర్, ఆశయ్య, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# భీమేశ్వరుడి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

**శ్రావణ చివరి సోమవారం.. 75 వేల మంది భక్తుల రాక**

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 7(నేటినిజం ప్రతినిధి): దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలో శ్రావణమాస చివరి సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. తెలంగాణలోని వివిధ జిలాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామునే ఆలయానికి చేరుకున్న భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. భీమేశ్వర స్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వర్గాల ప్రకారం సోమవారం సుమారు 75 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, రూ.40 లక్షల మేర ఆదాయం సమకూరింది. శ్రావణమాసం చివరి దశకు చేరుకోవడంతో రానున్న రోజుల్లోనూ భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు, అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ఆలయ డిప్యూటీ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. దర్శనం, క్యూలైన్ల నిర్వహణతో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

**ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి.. ఎంపీడీవో పావని**

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7:ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఊట్కూర్ ఎంపీడీవో పావని సూచించారు. సోమవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన అనంతరం వాటిని సకాలంలో పరిష్కరించినప్పుడే ప్రజావాణి కార్యక్రమానికి సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు.

# 'పంచకుల'లో కేంద్ర పర్యావరణ మంత్రి నేతృత్వంలో అంతర్జాతీయ రాబందుల అవగాహన దినోత్సవం- 2026

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:హర్యానాలోని పంచకుల వేదికగా అంతర్జాతీయ రాబందుల అవగాహన దినోత్సవం – 2026ను ఈ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా.. 'సంక్షోభం నుంచి కోలుకునే దిశగా భారతీయ రాబందుల పరిరక్షణ' అనే ప్రధాన ఇతి వృత్తంతో నిర్వహించిన జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హర్యానా రాష్ట్ర పర్యావరణ, అటవీ, వన్యప్రాణి సంరక్షణ శాఖ మంత్రి శ్రీ రావు నర్బీర్ సింగ్, కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, హర్యానా ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంఓఈఎఫ్‌సీసీ), కేంద్ర జంతు ప్రదర్శన శాలల ప్రాధికార సంస్థ (సీజెడ్ఏ), హర్యానా అటవీ, వన్యప్రాణి సంరక్షణ శాఖ, బొంబాయి ప్రకృతి శాస్త్ర అధ్యయన సొసైటీ (బీఎన్‌హెచ్ఎస్), పింజోర్‌లోని జటాయు సంరక్షణ, ప్రజనన కేంద్రం (జేసీబీసీ) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. భారత్‌లో రాబందుల పరిరక్షణ దిశగా సమష్టి కృషిని బలోపేతం చేసే దిశగా.. అటవీ శాఖ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, పశు వైద్యులు, జంతు ప్రదర్శన శాలల నిపుణులు, సంరక్షణ రంగంలో నిపుణులు, సంబంధిత భాగస్వామ్య పక్షాలన్నింటినీ ఈ సమావేశం ఒక్క వేదికపైకి తెచ్చింది.

సభను ఉద్దేశించి శ్రీ యాదవ్ ప్రసంగిస్తూ... ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రభుత్వ పర్యావరణ సంరక్షణ విధానం నిర్దిష్ట జాతులకు మాత్రమే పరిమితం కాలేదనీ, మొత్తం పర్యావరణ వ్యవస్థ ఆధారిత ప్రాతిపదికగా సమగ్ర దృక్పథంతో సాగుతోందనీ అన్నారు. పెద్ద పులి జాతులు, స్లాత్ ఎలుగుబంట్లు, బట్టమేక పక్షులు, డాల్ఫిన్లు, ఘరియల్ మొసళ్ళు, అడవి దున్నలు, రాబందులు... ఇలా ఏ జాతి సంరక్షణ కార్యక్రమాన్ని పరిశీలించినా ప్రభుత్వ విధానం స్పష్టంగా ప్రతిబింబిస్తుందని మంత్రి పేర్కొన్నారు. రాబందుల గురించి మాట్లాడుతూ... తెల్లని




వీపు (వైట్ రంప్డ్) రాబందులు, పొడవు ముక్కు (లాంగ్ బిల్డ్) రాబందులు, సన్నని ముక్కు గల (స్లెండర్ బిల్డ్) రాబందులు, ఎర్ర తల రాబందులు, ఈజిప్షియన్, హిమాలయన్ గ్రిఫాన్, యురేషియన్ గ్రిఫాన్, సినిరియస్, బియర్డ్ రాబందుల వంటి వైవిధ్యభరితమైన స్థానిక, వలస వచ్చిన రాబందులకు భారత్ ఆవాసంగా ఉందన్నారు. వాటి సంరక్షణ కోసం భారత్ విజయవంతంగా కృషి చేస్తోందన్నారు.

పర్యావరణ వ్యవస్థలో అత్యంత సమర్థమైన పారిశుద్ధ్య కార్మికులుగా రాబందులు కీలక పాత్ర పోషిస్తాయన్న శ్రీ యాదవ్.. ప్రకృతి తయారు చేసుకున్న స్వీయ పారిశుద్ధ్య వ్యవస్థగా వాటిని అభివర్ణించారు. జంతు కళేబరాలను వేగంగా ఆహారంగా తీసుకోవడం ద్వారా.. పోషకాల పునర్వినియోగానికి తోడ్పడుతూ, పర్యావరణ సమతౌల్యాన్ని రాబందులు కాపాడతాయని వివరించారు. వాతావరణ మార్పులు, మానవ – వన్యప్రాణి సంఘర్షణ వంటి అనేక సవాళ్లను నేడు ప్రపంచం ఎదుర్కొంటోందన్నారు. రాబందుల ఆహార గొలుసులో అవాంతరాలు, జంతువుల చికిత్సలో వాడే పెయిన్ కిల్లర్ల ప్రభావం వల్ల.. ముఖ్యంగా 1990ల నుంచి భారతీయ రాబందుల సంఖ్య చాలా వరకు క్షీణించిందని తెలిపారు.

రాబందుల పరిరక్షణ కోసం విధాన రూపకల్పనలో ప్రభుత్వ యంత్రాంగమంతా, సమాజమంతా ఏకమై సమన్వయంతో కృషిచేయడం ఆవశ్యకమని మంత్రి స్పష్టం చేశారు. రాబందులకు సురక్షితమైన పశువైద్య విధానాలు, సురక్షిత ఆహార లభ్యత, అడవుల్లో ఆ జాతుల పునరుద్ధరణకు తోడ్పడేలా సాంకేతిక సామర్థ్యాలను పెంచుకోవడం ద్వారా... 'రాబందుల సురక్షిత ప్రాంతాల'ను సృష్టించే దిశగా నిరంతరం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాబందుల పరిరక్షణలో పశువైద్యులు, పశు పోషకులు, స్థానిక పరిపాలన యంత్రాంగం, స్థానిక ప్రజలు క్రియాశీలక భాగస్వాములు కావాలనీ, కళేబరాల నిర్వహణలో సురక్షిత పద్ధతులను ప్రోత్సహించాలనీ ఆయన విజ్ఞప్తి చేశారు.

అంతకుముందు పింజోర్‌లోని జేసీబీసీ సందర్శనతో కేంద్ర మంత్రి తన పర్యటనను ప్రారంభించారు. అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. సంరక్షణ కేంద్రం తీసుకుంటున్న చర్యలపై ఏర్పాటు చేసిన ప్రజెంటేషన్‌ను వీక్షించారు. రాబందుల పరిరక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులతో సంభాషించారు. హర్యానా అటవీ శాఖ, బీఎన్‌హెచ్ఎస్ సంయుక్త భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాయి. తెల్ల వీపు, పొడవు ముక్కు, సన్నని ముక్కు గల రాబందుల సంరక్షణ, ప్రజనన చర్యలకు సంబంధించి అత్యంత కీలక కేంద్రంగా ఇది రూపుదిద్దుకుంది.

శాస్త్రీయ పద్ధతుల్లో పెంపకం, కృత్రిమంగా ఇంక్యుబేషన్ పద్ధతులు, పశువైద్యం, ప్రజనన – జన్యుపరమైన యాజమాన్య పద్ధతులను ఈ కేంద్రంలో చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు. 2025–26 సమయానికి జటాయు సంరక్షణ కేంద్రంలో 356 రాబందులు ఆవాసం పొందుతుండగా.. 35 రాబందు పిల్లలు జన్మించాయని తెలిపారు. అలాగే 87 రాబందులను స్వేచ్ఛా వాతావరణంలోకి విడుదల చేయగా.. మరో 90 పక్షులను ఇతర సంరక్షణ-ప్రజనన కేంద్రాలకు తరలించారు. అంతేకాకుండా 22 సంస్థలకు చెందిన 1,222 మందికి శిక్షణ ఇవ్వడం ద్వారా రాబందుల పరిరక్షణలో సాంకేతిక సామర్థ్యం పెంపొందేలా ఈ కేంద్రం కృషి చేసింది. సభనుద్దేశించి శ్రీ రావు నర్బీర్ సింగ్ మాట్లాడుతూ.. పింజోర్‌లోని జటాయు సంరక్షణ, ప్రజనన కేంద్రం (జేసీబీసీ)లో విజయవంతంగా కొనసాగుతున్న రాబందుల పరిరక్షణ కార్యక్రమాన్ని, కేంద్రం అందిస్తున్న కీలకమైన సేవలను వివరించారు. ఒక్క జన్మించిన పక్షుల సంఖ్య మాత్రమే సంరక్షణ, ప్రజనన సేవల జయాపజయాలకు కొలమానం కాదన్నారు. ఆరోగ్యకరమైన, జన్యుపరంగా క్రమబద్ధీకరించిన రాబందులు, శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడం, సాంకేతిక సామర్థ్యాలను విస్తరించుకోవడం, అడవుల్లో ఈ జాతుల పునరుద్ధరణ చర్యలే.. కార్యక్రమ విజయానికి ప్రాతిపదికలుగా ఉంటాయన్నారు. ప్రారంభోత్సవ సభలో భాగంగా.. 'స్టోరీ ఆఫ్ జటాయు: సేవింగ్ ఇండియాస్ వల్చర్' అనే కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాబందుల సంఖ్యలో క్షీణత నుంచి పింజోర్‌లో జేసీ బీసీని నెలకొల్పడం ద్వారా విజయవంతంగా చేపట్టిన ప్రజనన, సంరక్షణ కార్యక్రమం వరకు... రాబందుల సంరక్షణలో భారత్ విశిష్ట ప్రయాణాన్ని ఈ పుస్తకం సమగ్రంగా వివరిస్తుంది. అలాగే రాబందుల సంరక్షణపై నిర్వహించిన ఆన్‌లైన్ డ్రాయింగ్, డిజిటల్ ఫొటోగ్రఫీ పోటీల విజేతలకు ఈ సందర్భంగా బహుమతులను అందించారు. భారత పర్యావరణ వ్యవస్థలో రాబందుల వికాసం కొనసాగుతూ, కీలక పాత్రను పోషించే దిశగా పునరంకితం కావాలన్న సంకల్పంతో.. అంతర్జాతీయ రాబందుల అవగాహన దినోత్సవం- 2026 సందర్భంగా ఈ జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. 'సంక్షోభం నుంచి కోలుకునే దిశగా' సాగుతున్న ఈ ప్రయాణం.. శాస్త్రీయ పద్ధతులు, సరైన విధానాలు, సంరక్షణ – ప్రజననం, సురక్షిత ఆవాసాలు, సామాజిక భాగస్వామ్యం ద్వారా రాబందుల పరిరక్షణకు భారత్ సమష్టిగా కట్టుబడి ఉందని స్పష్టం చేస్తోంది.

# పేదల సొంతింటి కలను నెరవేర్చిన కాంగ్రెస్

**ఇందిరమ్మ ఇంట్లో ఘనంగా గృహప్రవేశం**



నిజామాబాద్, సెప్టెంబర్ 7:కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రంగు అనిల్‌గౌడ్ అన్నారు.


వేల్పూర్ మండల కేంద్రంలో కాంతమ్మకు ప్రభుత్వం మంజూరు చేసిన నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగు అనిల్‌గౌడ్ రిబ్బన్ కత్తిరించి గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి సొంతింటి కలను సాకారం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అనిల్‌గౌడ్ సూచించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేష్, హరికిషన్, ఇంద్రగౌడ్, చిన్నయ్య, లావణ్యతో పాటు మండల నాయకులు, యువజన విభాగం సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా వెంకటాపూర్‌లో కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ గర్జన

**మండల స్థాయి కార్యాలయాల ఎదుట ఆందోళన**
**గ్రీవెన్స్ లో తహసిల్దార్ కు వినతి**
**ఎమ్మెల్యేల అక్రమ అరెస్టును నిరసిస్తూ రహదారిపై ధర్నా రాస్తారోకో**

ములుగు, సెప్టెంబర్ 7:(నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆధ్వర్యంలో సోమవారం వెంకటాపూర్ మండల కేంద్రంలోఆందోళన చేపట్టారు.



తహసీల్దార్, ఎంపీడీవోకార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు చేయటం తో పాటు కాంగ్రెస్ సర్కార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఆనంతరం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో, తహసీల్దార్ లకు ప్రజావాణిలో 12 ప్రధానడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి మాట్లాడుతూ..గ్రామాల్లో పారిశుధ్యం, డ్రైనేజీ, సీసీ రోడ్ల పనుల పెండింగ్ బిల్లులను వెంటనేచెల్లించాలని అన్నారు. అదేవిధంగా గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం నూతనంగా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.గ్రామాలు, పట్టణాల్లో చెత్త సేకరణ, డ్రైనేజీల శుభ్రత, మురుగునీటి నిర్వహణ సక్రమంగా చేపట్టడం తోపాటు పారిశుధ్య కార్మికులకు వేతనాలు, పనిముట్లు అందించాలని కోరారు. తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో శాశ్వత పరిష్కారం చూపి పైప్ లైన్లు, మోటార్లు, నీటిట్యాంకుల మరమ్మతులు చేపట్టాలని అన్నారు.దెబ్బతిన్న గ్రామీణ రోడ్లను వెంటనే మరమ్మతు చేయాలన డిమాండ్ చేశారు.

రైతులకు పంట సాగుకు నీళ్లు,విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలని అన్నారు. రైతు భరోసా×పంట× నష్టపరిహారం, పంట బీమా అర్హులైన ప్రతి రైతుకుఇవ్వాలని, చెరువులు, కుంటలు, కాలువల మరమ్మతులు చేపట్టి సాగునీటి వసతి కల్పించాలని కోరారు. గ్రామాల్లో లో-వోల్టేజ్, విద్యుత్ అంతరాయం సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేసి తాగునీరు, టాయిలెట్లు, ప్రహరీ కల్పించాలని అన్నారు.ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేసి మందులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కోసం నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని, పేదలు, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు సంక్షేమ పథకాలు ఎటువంటి జాప్యం లేకుండా అందించాలని, ఇల్లు లేని నిరుపేదలకు ఆర్థిక వుసహాయం అందించాలని కోరారు.ప్రతి సమస్యకు బాధ్యత వహించే శాఖను గుర్తించి నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రంలోని తాళ్లపాడు సెంటర్లో నాయకులు ధర్నా రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారి వెంట వానాలు ఎక్కడిక్కడ నిలిచిపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని నిరసన కారులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి జిల్లా నాయకుడు మల్క రమేష్, అబ్బ గోపాల్ రెడ్డి పి ఎ సి ఎస్ చైర్మన్ కాసర్ల కుమార్ గ్రామకం అధ్యక్షులు నర్ర భద్రయ్య, చంటి భద్రయ్య మేడ వేనా అశోక్ రామిల్ల రాజేందర్ నా నరెడ్ల విజేందర్ గాజుల శ్రీనివాస్ జాటోత్ గణేష్ డోలి రజిత శ్రీనివాస్ పోశాల వీరమల్లు దుగ్యాల రాజేశ్వరరావు చింతి రెడ్డి అనోద్ రెడ్డి, గట్టు కుమార్ చింతం ప్రకాష్ మూల రత్నాకర్ ఈరబోయిన సాంబయ్య అంతటి రాము బోయిని సదయ్య సామర్ల శంకర్ మొలుగురి మహేందర్ బగిరెడ్డి శ్రీనివాసరెడ్డి చిక్కుల కళ్యాణ్ మారపల్లి భద్రయ్య మెట్టు మల్లయ్య తోట సంపత్ బొంతల శ్రీనివాస్ మల్లపల్లి గణేష్, బుర్రమహేందర్, పోసాల రాజేందర్ నళిగంటి శ్రీకాంత్ మారేపల్లిస్వామి పెండ్యాల జితేందర్ దుద్దిళ్ల దేవేందర్ రేణిగుంట్లశరత్ కుమార్, సోమిడి రవిసోషల్ మీడియా చిగురు దేవేందర్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడం దుర్మార్గం



ములుగు, సెప్టెంబర్ 7:(నేటినిజం ప్రతినిధి): బిఆర్ ఎస్‌పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి, మరియు ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గార్ల ఆదేశాల మేరకు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే చర్యలను తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్ నాయకులు

మంగపేట మండలం:

బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రభుత్వం వ్యవహరించిన తీరును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా మంగపేట మండల పార్టీ మాజీ అధ్యక్షులు ×కుడుముల లక్ష్మినారాయణ× గారి ఆధ్వర్యంలో గంపోనీగూడెం గ్రోమోర్ సమీపంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కుడుముల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు ప్రజల సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రశ్నించే హక్కు ఉందని అన్నారు. ప్రజల తరఫున మాట్లాడాల్సిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమేనని తీవ్రంగా విమర్శించారు.

ప్రజల గొంతుకగా నిలిచే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల గొంతు నొక్కాలని చూస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రతిపక్షాన్ని అణచివేసి ప్రశ్నించే గొంతులను మూయించాలని చూస్తే అది ప్రభుత్వ నియంతృత్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షం బాధ్యత అని, ఆ బాధ్యతను అడ్డుకునే ఎలాంటి ప్రయత్నాలను బీఆర్ఎస్ పార్టీ సహించబోదని స్పష్టం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం ఆపేది లేదని తేల్చిచెప్పారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని వెంటనే మార్చుకోవాలని, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు అసెంబ్లీలో స్వేచ్ఛగా ప్రజా సమస్యలను ప్రస్తావించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మండల మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్,మల్లూరు దేవస్థాన మాజీ చైర్మన్, నూతిలకంటి ముకుందం, జిల్లా నాయకులు తాటి కృష్ణ, పప్పు వెంకట్ రెడ్డి,కర్రీ శ్యాంబాబు, కూర్బన్ ఆలీ,చిట్టీమల్ల సమ్మయ్య,కొమరం రాం మూర్తి, గాదె శ్రీనివాస చారి, పూజారి శ్రీను,జిల్లా యూత్ మాజీ ప్రధాన కార్యదర్శి బడిశా నాగ రమేష్, జిల్లా మహిళ నాయకురాలు ధనలక్ష్మి, కాటూరి సుగుణ,గ్రామ కమిటీ మాజీ అధ్యక్షులు నూనె లింగయ్య, రావుల రమణ, తుక్కని శ్రీనివాస్, మునిగేలా సాంబులు, రూప భద్రయ్య, పుల్లారావు, పార్టీ నాయకులు, అయూబ్, బుట్టో, చల్లగురుగుల తిరుపతి,అచ్చ సత్యనారాయణ, తోలెం,నర్సింహారావు, కోరం నర్సింహాలు, గుడిసేవ నాగేశ్వరావు, చక్రధర్, పంజాల సత్యం, సామ మధుకర్ రెడ్డి,దంతానపల్లి నరే ందర్, పుల్లారావు, రఘు, ఫోరోజ్, పోలేం తిరుపతి,వట్టం రాం బాబు, ఇట్టబోయిన సాంబయ్య నర్సయ్య, యూత్ నాయకులు రవి, రామస్వామి,సారయ్య, ఆది, సోషల్ మీడియా ఇంచార్జ్ బీసా సాంబయ్య, గుడివాడ,శ్రీహరి తదితరులు పాల్గొన్నరు

# మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

గములుగు, సెప్టెంబర్ 7:(నేటినిజం ప్రతినిధి): వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాల వినియోగం వల్ల జల వనరులు కాలుష్యానికి గురవుచున్నాయని, అందుచే కృత్రిమ రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలను మానివేసి మట్టితో చేసిన విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.

సోమవారం జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని తన ఛాంబర్లో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఈ సంవత్సరం, పర్యావరణం పై అవగహన కల్పించేందుకు, మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోని పర్యావరణాని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో భాగంగా 8 అంగుళాల మట్టి గణపతి లను అందించి పర్యావరణంపై అహగహన కార్యక్రమాలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారిచే నిర్వహంచడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. చెరువుల్లో మట్టి మేటలను తొలిగించటానికి చెరువులో స్వచ్ఛత కాపాడటానికి వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తులు నడుము బిగించాలని మట్టి తో వినాయక విగ్రహాలు తాయారు చేసి భక్తితో చెరువులోకి చేర్చొచ్చని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. మట్టి విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఏ ఈ ఎస్, టి జి పి సి బి నోడల్ ఆఫీసర్ ములుగు అరుణ దేవి, డి పి ఆర్ ఓ రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

# బైక్‌ల దొంగ అరెస్ట్

**రూ.14 లక్షల విలువైన 22 మోటార్ సైకిళ్లు స్వాధీనం..**

అమరావతి, సెప్టెంబర్ 7: నరసరావుపేట పట్టణంలో వరుసగా జరుగుతున్న మోటార్ సైకిళ్ల దొంగతనాలకు నరసరావుపేట టౌన్ పోలీసులు చెక్ పెట్టారు. బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఓ నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి సుమారు రూ.14 లక్షల విలువైన 22 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల కథనం ప్రకారం.. నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు ఆదేశాల మేరకు నరసరావుపేట 1వ పట్టణ సీఐ ఫిరోజ్, ఎస్సై పి. వంశీకృష్ణ సిబ్బందితో కలిసి బైక్ దొంగతనాలపై ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నరసరావుపేట టౌన్ ఫస్ట్ గేట్ నుంచి షాలేంనగర్ వెళ్లే రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న యన్నబత్తుని మణికంఠ (22)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**మార్చి నుంచి ఆగస్టు వరకు దొంగతనాలు**

నిందితుడిని విచారించగా, 2026 మార్చి నుంచి ఆగస్టు వరకు నరసరావుపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసి ఉన్న మోటార్ సైకిళ్లను దొంగిలించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు మొత్తం 22 దొంగిలించబడిన మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.14 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మణికంఠపై నరసరావుపేట 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో 12 కేసులు, 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు కలిపి మొత్తం 13 మోటార్ సైకిల్ దొంగతనం కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు.

**:అదనపు లాక్‌లు వినియోగించాలి..**

వాహనదారులు తమ మోటార్ సైకిళ్లను పార్క్ చేసే సమయంలో కేవలం హ్యాండిల్ లాక్‌పైనే ఆధారపడకుండా అదనపు భద్రతా లాక్‌లను వినియోగించాలని పోలీసులు సూచించారు. పట్టణంలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కేసును చాకచక్యంగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేయడంతో పాటు 22 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్న నరసరావుపేట 1వ పట్టణ పోలీస్ సిబ్బందిని నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావుతో పాటు పల్నాడు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# లక్షెట్టిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక



ఆదిలాబాద్, సెప్టెంబర్ 7:లక్షెట్టిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్కిల్ పరిధిలోని ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులంతా సమావేశమై నూతన పాలకమండలిని ఏకతాటిపై ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చెట్ల రమేష్ మాట్లాడుతూ.. లక్షెట్టిపేట సర్కిల్ పరిధిలోని ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ బలోపేతానికి, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. పాత్రికేయులకు ఏ కష్టం వచ్చినా ముందుండి సమస్యల పరిష్కారానికి పోరాడతామన్నారు. ప్రభుత్వం నుంచి జర్నలిస్టులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, అక్రిడిటేషన్లు, ఇతర హక్కులు ప్రతి ఒక్కరికీ చేరేలా యూనియన్ బాధ్యత తీసుకుంటుందని పేర్కొన్నారు. తమ ఎన్నికకు సహకరించిన సర్కిల్ జర్నలిస్టు మిత్రులందరికీ ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# గ్రామాలకు మౌళిక సౌకర్యాల కల్పన ధ్యేయంగా కృషి..

**అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**
**ఆముదార్లంకలో దాదాపు రూ.కోటితో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే**



అమరావతి, సెప్టెంబర్ 7:ఇబ్బందుల్లో ఉన్న గ్రామాలకు మౌళిక సౌకర్యాల కల్పన ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. సోమవారం ఉదయం చల్లపల్లి మండలం ఆముదార్లంకలో దాదాపు రూ.కోటి నిధులతో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. పల్లె పండుగ-1లో రూ.85.70 లక్షలతో నూతనంగా నిర్మించిన 1.45కిలోమీటర్ల మేర నిర్మించిన ఏడు సీసీ రోడ్లు ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.9లక్షలతో నిర్మించిన నూతన మంచినీటి పైప్ లైన్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా సభలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ? కృష్ణానదికి వరదలు వచ్చిన ప్రతిసారి సహాయక చర్యలకు సైతం ఎదురవుతున్న ఇబ్బంది గమనించి నియోజకవర్గంలోని అన్ని నదీగర్భ గ్రామాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా పల్లె పండుగ-1 కార్యక్రమంలో మంజూరు చేసిన ఉపాధి హామీ పథకం నిధులతో నూరు శాతం సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఆముదార్లంకలో రూ.85.70 లక్షలతో ఏడు సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఈ గ్రామం భౌగోళికంగా బాపట్ల జిల్లాలో ఉన్నప్పటికీ ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తున్నట్లు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ అభివృద్ధికి, మహాత్మా గాంధీ ఆశించిన గ్రామ స్వరాజ్య సాధనకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గానికి మంజూరు చేసిన పల్లె పండుగ-1 నిధులు రూ.31.65 కోట్లతో 45.6కిలోమీటర్ల మేర 462 సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. పల్లె పండుగ-2 నిధులతో దాదాపు 15 కిలోమీటర్లు తారు రోడ్లు నిర్మించగా, రాబోయే పల్లె పండుగ-3 నిధులతో రైతులకు కీలకమైన డొంక రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఐక్యత ఉంటే అభివృద్ధి సుసాధ్యం అన్నారు. ఈ గ్రామంలో రహదారుల నిర్మాణానికి ముందుండి సహకరించిన గ్రామ పెద్దలు వేములపల్లి రాఘవేంద్రరావును అభినందించారు.

ఎమ్మెల్యేకు సత్కారం

తమ గ్రామానికి నూరు శాతం సీసీ రోడ్లు నిర్మించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ను గ్రామ పెద్దలు, టీడీపీ, జనసేన నాయకులు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, గ్రామ ప్రముఖులు వేములపల్లి రాఘవేంద్రరావు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఆనందకుమారి, ఏపీఎస్ ఐడీసీ డైరెక్టర్ పైడిపాముల కృష్ణకుమారి, మాజీ సర్పంచ్ ఆదిలక్ష్మి, టీడీపీ గ్రామ అధ్యక్షులు మండవ బాబు, జనసేన పార్టీ నాయకులు గొరికపూడి ప్రసాద్, టీడీపీ నాయకులు మండవ బాబు, కొల్లి మురళీ, గొరికపూడి పాములు, రాజేష్, పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ పగడాల సురేష్, ఏఈఈ బొప్పన శ్రీనివాసరావు, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏఈఈ భోగాది జగత్, పంచాయతీ కార్యదర్శి మెరకనపల్లి నాగ వెంకట తిరుమలేష్, వీఆర్ఓ పెనుమూడి వెంకటేశ్వరరావు, గ్రామస్థులు, స్వర్ణ గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటికీ తెలుగుదేశం ముందంజ..

**తెలుగు తమ్ముళ్లలో ఆనందోత్సాహం..**
**రాష్ట్రంలో 5వ ర్యాంక్ తో ముందుకు పరుగు..**
**ఈ నెల 9న ముగియనున్న కార్యక్రమం**
**చివరి నిమిషంలో ర్యాంకులు తారుమారు అయ్యే అవకాశం**
**జిల్లా లో కార్యక్రమం సక్సెస్**

అమరావతి, సెప్టెంబర్ 7:కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న వేళ, చేపట్టిన అభివృద్ధి-సంక్షేమ ఫలాలను ప్రజా క్షేత్రంలోకి




తీసుకెళ్లేందుకు ప్రారంభించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం చివరి ఘట్టానికి చేరింది. 45 రోజుల పాటు నిర్ణయించిన ఈ ప్రచార పర్వం మరో రెండు రోజుల్లో ముగియనుండటంతో నియోజకవర్గాల వారీగా పార్టీ అధిష్ఠానం ప్రగతి నివేదికలను, ర్యాంకులను విడుదల చేసింది. ఈ రేసులో పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట నూరు శాతం లక్ష్యంతో రాష్ట్రంలోనే 5వ స్థానంలో నిలిచి సత్తా చాటగా, నరసరావుపేట వెనుకబడి 129వ స్థానానికి పరిమితమైంది.

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, ఈ కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో 2026 జులై 27 ప్రారంభమైన 45 రోజుల ఈ కార్యక్రమం 2026 సెప్టెంబరు 9న ముగుస్తుంది. మరో రెండు రోజుల్లో ఈ కార్యక్రమం ముగియనున్న నేపథ్యంలో జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొనగా, కొన్ని నియోజకవర్గాల్లో లైట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ అధిష్టానం ఈ దిశగా ఆరా తీసినట్లు సమాచారం.

ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, ఈ కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో టీడీపీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను వివరిస్తున్నారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, పేద వర్గాలకు అందుతున్న సంక్షేమ ఫలాలను తెలియజేస్తున్నారు. ప్రతీ ఇంటికి పార్టీ నేతలు స్వయంగా వెళ్లి గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయడం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ప్రచారంలో భాగంగా ప్రజలతో సంబంధాలను బలపరుచుకోవడం. ఇంటింటి పర్యటనల్లో ప్రతి కుటుంబం నుంచి వస్తున్న స్పందనతో పాటు, వారి స్థానిక సమస్యలను మరియు అవసరాలను తెలుసుకోవడం. సేకరించిన స్థానిక సమస్యలు, అవసరాలను నేరుగా డిజిటల్ యాప్‌లో నమోదు చేసి అధిష్ఠానానికి నివేదించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.. దీని వల్ల ప్రజలతో పార్టీ నేతలకు నేరుగా సంబంధాలు మెరుగుపడతాయని, సంక్షేమ పథకాలు ఏ వర్గానికి అందటం లేదో తెలుస్తాయని అధిష్టానం భావించింది.

కొన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం సూపర్ సక్సెస్ కాగా మరి కొన్నిచోట్ల అధిష్ఠానం ఆశించిన విధంగా నేతలు నిర్వహించలేక పోయారు. ఈ కార్యక్రమం ప్రారంభించి సోమవారానికి 43 రోజులు పూర్తయింది. మరో రెండు రోజుల్లో కార్యక్రమం ముగియనుంది. ఈ క్రమంలో నియోజకవర్గాల వారీగా కార్యక్రమ నిర్వహణకు అధిష్ఠానం ర్యాంకులు ప్రకటించింది. శుక్రవారం నాటికి చిలకలూరిపేట జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో, రాష్ట్ర స్థాయిలో ఐదో స్థానంలో నిలిచింది. జిల్లాలో నరసరావుపేట చిట్టచివరన ఉండగా రాష్ట్ర స్థాయిలో 129వ స్థానంలో నిలిచింది. జిల్లాలో 5,73,365 ఇళ్లు ఉండగా ఇప్పటి వరకు 5,07,642 ఇళ్లను పార్టీ శ్రేణులు సందర్శించాయి. ఇళ్ల సందర్శనలో జిల్లా రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో ఉంది. మరో ఐదు రోజుల్లో 65,723 ఇళ్లను సందర్శించాల్సి ఉంది. చిలకలూరిపేటలో మాత్రం నూరు శాతం పూర్తయింది. ఒక సారి జిల్లాకు రాష్ట్ర స్థాయిలో వచ్చిన ర్యాంకులను పరిశీలిస్తే చిలకలూపేట నియోజవకర్గంలో 76,416 ఇళ్లు ఉంటే మొత్తం ఇళ్లను కవర్ చేయడంతో రాష్ట్ర స్థాయిలో ఐదో ర్యాంకు లభించింది. ఇలా శుక్రవారం నాటి లెక్కలను పరిశీలిస్తే వినుకొండకు 16వ ర్యాంకు, గురజాలకు 20, మాచర్లకు 23, పెదకూరపాడుకు 42,సత్తెనపల్లికు 78, నరసరావుపేటకు 129వ ర్యాంకు లభ్యమైంది.


# ఆర్థికాభివృద్ధి సాధనకు అక్షరాస్యత అనివార్యం

సాంప్రదాయకంగా భాషను ఉపయో గించేందుకు అవసరమైన చదవటం, రాయటం, వినటం, మాట్లాడటం అనే నాలుగు ప్రాథమికాంశాలు తెలుసు కోవటాన్నే అక్షరాస్యత అనవచ్చు. అయితే.. రాయడం, చదవటం మాత్రమే అక్షరాస్యత కాదనీ.. గౌరవం, అవకాశాలు, అభివృద్ధి గురించి చెప్పడమే నిజమైన అక్షరాస్యత అని విజ్ఞుల అభిప్రాయం. ప్రపంచం అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు విద్య, విజ్ఞానం ఎంతో అవసరం. ఉన్నతమైన జీవనానికి ఇవి ఎంతో ముఖ్యం. యునెస్కో సెప్టెంబర్ 8 తేదీని అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవంగా ప్రకటించింది. దీని ముఖ్య ఉద్దేశం అక్షరాస్యతను వ్యక్తులు మరియు సంఘాలకు అందించడం. ఇది పిల్లల్లోనే కాకుండా వయోజన విద్య మీద కూడా కేంద్రీకరించ బడినది.

ప్రతి యేడాది సెప్టెంబర్ 8వ తేదీని "అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం"గా జరుపు కోవడం ఆనవాయితీ. 1965వ సంవత్సరం, నవంబర్ 17వ తేదీన యునెస్కో సభ్య దేశాల విద్యా శాఖా మంత్రుల మహాసభ అనంతరం.. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం ప్రకటించ బడింది. ఆ తరువాత 1966వ సంవత్సరం నుండి ప్రతి యేడాదీ క్రమం తప్పకుండా జరుపు కుంటున్నాం.

ప్రపంచంలోని కొన్ని దేశాలు అన్ని రకాలుగా వెనుబడి ఉండటానికి నిరక్షరాస్యత ముఖ్య కారణమనేది కాదనలేని వాస్తవం. అదలా ఉంటే... ఐక్య రాజ్య సమితి విద్యా, విజ్ఞాన (శాస్త్రీయ) మరియు సాంస్కృతిక సంస్థ (యునెస్కో), ఐక్యరాజ్య సమితికి చెందిన ఒక ప్రధాన అంగము. ఇది1945లో స్థాపించ బడిన ప్రత్యేక సంస్థ. ఈ సంస్థ తన క్రియా శీల కార్య క్రమాలలో శాంతి, రక్షణలకు తోడ్పాటును అందించటమే గాక... అంతర్జాతీయ సహకారంతో విద్య, విజ్ఞానం, సాంస్కృతిక పరిరక్షణ కోసం పాటు పడుతుంది. 193మంది సభ్యులు, ఆరుగురు అసోసియేట్ సభ్యులు కలిగిన యునెస్కో ప్రధాన కేంద్రం ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఉంది. యునెస్కో తన తన కార్య క్రమాలను 5 రంగాలలో నిర్వహిస్తుంది, అవేంటంటే... విద్య, ప్రకృతి విజ్ఞానం, సామాజిక మరియు మానవ శాస్త్రాలు, సంస్కృతి, మరియు కమ్యూనికేషన్లు మరియు ఇన్ఫర్మేషన్. యునెస్కో విద్య ద్వారా "అంతర్జాతీయ నాయకత్వం" కొరకు అవకాశాల కల్పనలో తన వంతు కృషి చేస్తుంది. దీని ప్రధాన ఉద్దేశ్యం... వివిధ దేశాలలో విద్యా విధానలను క్రమ బద్ధీకరించడం, ట్రైనింగ్ రీసెర్చ్‌లు చేపట్టడం.యునెస్కో ప్రజా ప్రకటనలిచ్చి, ప్రజలను చైతన్యవంతం చేస్తుంది. సాంస్కృతిక మరియు శాస్త్రీయ ఉద్దేశ్యాలు కలిగిన ప్రాజెక్టులను చేపడుతుంది. "భావ వ్యక్తీకరణ స్వాతంత్ర్యాన్ని, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ప్రోత్సహిస్తుంది. మీడియా ద్వారా, సాంస్కృతిక భిన్నత్వాలను తెలియ జేస్తున్నది. కాగా... యునెస్కో 1990 సంవత్సరాన్ని అక్షరాస్యతా సంవత్సరంగా ప్రకటించింది. ఇక ఐక్యరాజ్య సమితి అయితే 2003-2012ను అక్షరాస్యతా దశాబ్దంగా ప్రకటించింది. ఆ సంగతలా పక్కన బెడితే... ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో పోలిస్తే అక్షరాస్యత విషయంలో భారతదేశం ఆశించిన స్థానంలో లేదు. ఈ మాత్రమైనా మనదేశ అక్షరాస్యత ఉందంటే కొన్ని రాష్ట్రాలు అక్షరాన్యతను సాధించటంలో ముందుండటమే. మొత్తం మీద ప్రపంచ నిరక్షరాస్యుల్లో 35% మంది ఇంకా

**సెప్టెంబర్ 8... అక్షరాస్యతా దినోత్సవం**



మనదేశం లోనే ఉండటం విచారకరం. స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలంటే దేశంలో 80 శాతం అక్షరాస్యత సాధించాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన 73 ఏళ్లు గడుస్తున్నా 75 శాతం అక్షరాస్యతనే సాధించ గలిగాము. అందరూ చదివి నప్పుడే గ్రామాభివృద్ధి జరుగుతుంది. భారత దేశంలో అక్షరాస్యత రేటులో విస్తృత స్థాయిలో లింగ పరమైన అసమానత ఉంది. వయోజనుల అక్షరాస్యత రేటు పురుషుల్లో 76.9 శాతం ఉండగా, మహిళల్లో ఇది 54.5 శాతం మాత్రమే ఉంది. తక్కువ మహిళా అక్షరాస్యత రేటు భారత దేశంలో కుటుంబ నియంత్రణ, జనాభా స్థిరీకరణ చర్యలపై నాటకీయంగా ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రపంచ వ్యాప్తంగా అక్షరాస్యత వృద్ధిలో చారిత్రక క్రమాల ఆధారంగా, ప్రస్తుతం అత్యధిక మంది నిరక్షరాస్యులు భారతదేశం లోనే ఉంటారని అంచనా. వయోజన అక్షరాస్యత 15 సంవత్సరాలు, అంత కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారిని సూచిస్తుంది. యువజన అక్షరాస్యత 15-24 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారిని సూచిస్తుంది.

ఒకవైపు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆడపిల్లలు చదువులో

దూసు కెళుతున్నారు. మరోపక్క పేద దేశాల్లో బాలికలు పాఠశాల మెట్లెక్కడమే అదృష్టంగా భావిస్తున్నారు. 1947లో భారతదేశ అక్షరాస్యత కేవలం 12 శాతం మాత్రమే. 2018లో దేశ అక్షరాస్యత 74 శాతానికి చేరడం విశేషం. అంటే 517 శాతం పెరిగింది.

భారతదేశంలో అక్షరాస్యత సామాజిక - ఆర్థిక పురోగతికి కీలకంగా ఉంది. తాజా అధ్యయనం ప్రకారం భారత అక్షరాస్యత రేటు, ఆరు రెట్ల కంటే ఎక్కువ వృద్ధి సాధించినప్పటికీ, ప్రపంచ అక్షరాస్యత సగటుతో పోలిస్తే ఇప్పటికీ తక్కువగానే ఉంది. ప్రపంచంలో భారతదేశం ప్రస్తుతం అతి పెద్ద నిరక్షరాస్య జనాభా ఉన్న దేశంగా గుర్తించ బడుతోంది. అనేక ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేసినప్పటికీ భారతదేశ అక్షరాస్యత శాతం మంద కొడిగానే వృద్ధి చెందింది. ఇలాగైతే సంపూర్ణ అక్షరాస్యత స్థాయి సాధించడానికి భారతదేశానికి 2060 వరకు సమయం పడుతుందని సూచించింది. ఆసక్తికర అంశం ఏమిటంటే... ప్రపంచ జ్ఞాన వ్యవస్థలో భారతదేశం చాలా కీలక పాత్ర పోషించ బోతోంది. భారత్ ప్రపంచ గురువు కాబోతోంది. ప్రపంచంలోనే అతి పెద్ద సంస్కరణ 'నిష్టా' పేరిట 42 లక్షల మంది టీచర్లకు కేంద్ర ప్రభుత్వ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. విలువలు, ప్రమాణాలతో కూడిన విద్యను అందించే దిశగా అనేక చర్యలను కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ తీసుకుంది, మరిన్ని చర్యలను తీసుకో బోతోంది. నూతన విద్యా విధానంపై భారతీయులు అందరి అభిప్రాయాలు తెలుసు కోవాలనేదే మోడీ సర్కారు ఉద్దేశం. రాష్ట్రాల విద్యా మంత్రుల తోనూ, విద్యా శాఖ కార్యదర్శుల తోనూ, ముఖ్య మంత్రుల తోనూ నూతన విద్యా విధానంపై అభిప్రాయాలను గత ప్రభుత్వం

సేకరించడం జరిగింది. ఎన్‌జీవోలు, విద్యా రంగంలో గణనీయమైన ప్రగతి సాధించిన వారిని నేరుగా సంప్రదించి వారి అభిప్రాయాలను తెలుసుకుని, ఇక సామన్య ప్రజలు సైతం తమ అభిప్రాయలను తెలిపే వీలు కల్పించారు. ఇందుకు ప్రత్యేకించి ఒక పోర్టల్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ ఎటువంటి విద్యా విధానాన్ని కోరు కుంటున్నారనేది తెలియ జేయాలని కోరారు. ప్రతి సంస్కరణ, దేశ పురోభివృద్ధికి బాటలు వేయాలనేదే ఉద్దేశం. ఉన్నత విద్య సంస్కరణలు, భాషల అభివృద్ధి, పరిశోధనలకు పెద్ద పీట వేయాలని నూతన విద్యా విధానంలో తలపెట్టారు. ఇందుకు పెద్ద ఎత్తున నిధులు అవసరమవుతాయి. నిధుల సమీకరణ అనివార్యమే, అపుడే మనం ఆశించే సమగ్ర విద్యా విధాన విధాన అమలు కు మార్గం సుగమం అవుతుంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## ఆరెపల్లిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు

**నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి- మేయర్ కొలగాని శ్రీనివాస్**



కరీంనగర్, సెప్టెంబంర్ 7(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరంలోని అన్ని డివిజన్లలో సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా నగరపాలక సంస్థ పాలకవర్గం ముందుకు సాగుతోందని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.నగరంలోని 1వ డివిజన్ ఆరెపల్లిలో మున్సిపల్ సాధారణ నిధులు (ఎంజీఎఫ్) రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.అందుబాటులో ఉన్న మున్సిపల్ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆరెపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానికులకు, వాహనదారులకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారుతాయని అన్నారు.పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్‌ను మేయర్ ఆదేశించారు. పనులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి నాణ్యతా లోపాలకు తావులేకుండా చూడాలని సూచించారు.అభివృద్ధి పనులు చేపడుతున్నందుకు స్థానిక కాలనీవాసులు మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బారి అపర్ణ జితేందర్, మున్సిపల్ అధికారులు, కాలనీ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## కొండాపూర్‌లో వివాదస్పదంగా మారిన జండా గద్దె నిర్మాణం

**ఇరువర్గాల మధ్య తోపులాట, తీవ్ర ఉద్రిక్తత**
**బంజారులు పూజలు నిర్వహించడంపై గ్రామస్తులకు అభ్యంతరం**
**పోలీసులు రంగప్రవేశం పరిస్థితి విషమంగా మరదంతో లాఠీఛార్జి**



కామారెడ్డి, సెప్టెంబంర్ 7:(నేటినిజం ప్రతినిధి): సిరికొండ మండలంలోని కొండాపూర్ గ్రామంలో బంజారులు, గ్రామస్తులకు మధ్య జండా గద్దె విషయంలో ఘర్షణ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కొండాపూర్ బంజారులు గ్రామంలో జండా గద్దె నిర్మించడానికి పనులు ప్రారంభిస్తుండగా గ్రామ కార్యదర్శి ఎలాంటి అనుమతులు లేకుండా జండా గద్దె నిర్మించవద్దని అద్దెశించడంతో నిర్మాణం ఆపివేశారు. సోమవారం బజారులు పూజలు నిర్వహించగా గ్రామస్తులు అభ్యంతరం చెప్పడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితిసి తోపులాట చోటుచేసుకుంది. ఇందులో కొందరు గాయలపాలయారు. పరిస్థితి మితిమీరడంతో పోలీసులు లాఠీఛార్జి చేశారు. పరిస్థితిని అదుపు చేసి రెవెన్యూ అధికారులు, పోలీసులు ఇరువర్గాలతో మాట్లాడి శాంతి చేసి, సమస్యను పరిష్కరించుకునే దిశగా చూడాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా చూడాలన్నారు.

## కాంగ్రెస్ 420 హామీలపై బీఆర్ఎస్ భగ్గు

**వేములవాడలో నిరసన, ప్రజావాణిలో వినతి**




రాజన్న సిరిసిల్ల, సెప్టెంబంర్ 7(నేటినిజం ప్రతినిధి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ వేములవాడ పట్టణ బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. పట్టణంలో నిరసన తెలిపిన అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్‌కు మాజీ జెడ్పిటిసి మ్యాకల రవి వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ "420 హామీలు ఎక్కడ? ఆరు గ్యారెంటీల అమలు ఎక్కడ?" అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అనంతరం వాటి అమలుపై కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఆరు గ్యారెంటీలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయకపోవడం ప్రజలను మోసం చేయడమేనని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి హామీల అమలుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆర్ సి రావు, టిఆర్ఎస్ పార్టీ అర్బన్ మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేటీఆర్ అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ ఆందోళన



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబంర్ 7(నేటినిజం ప్రతినిధి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వేములవాడ పట్టణ బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. సోమవారం తెలంగాణ చౌక్‌లో నిరసన నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్లదుస్తులతో అసెంబ్లీకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడాన్ని నాయకులు తప్పుబట్టారు. ప్రజా సమస్యలను ప్రస్తావిస్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. 22ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, అర్హులైన రైతుల భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు."ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా?", "రైతుల 22ఏ సమస్యను పరిష్కరించాలి", "ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి", "కేటీఆర్‌ను అడ్డుకోవడం ఆపాలి" అంటూ నినాదాలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, సీనియర్ నాయకులు వెంగళ శ్రీకాంత్‌గౌడ్, వాసాల శ్రీనివాస్, మా

## ఎన్నికల హామీలు అమలు చేయాలని పెద్దకొడప్‌గల్ ప్రజావాణిలో ఫిర్యాదు

కామారెడ్డి, సెప్టెంబంర్ 7:(నేటినిజం ప్రతినిధి):కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం పెద్ద కొడప్ గల్ మండలంలోని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల వస్త్ర సముదాయం 'శ్రీ' ప్రారంభం

NEXT KEY
COMMUNICATIONS
Azam Khan
ph no: 9848343882, 6303093338

హైదరాబాద్, సెప్టెంబర్ 7:మహిళల మనస్సు దోచే సరికొత్త వస్త్రసముదాయం 'శ్రీ' నగరంలోని టీఎన్ఆర్ నార్త్ సిటీ మాల్‌లో మొట్టమొదటి రిటైల్ స్టోర్ను ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ 2026 రమ్య కైలాసా, సంస్థ సహ-వ్యవస్థాపకులు సందీప్ కపూర్, శీతల్ కపూర్ ప్రారంభించారు. ఆన్‌లైన్ ద్వారా రాష్ట్రంలో ఇప్పటికే మంచి ఆదరణ పొందింది. దేశ, విదేశాలలో 130 పైగా స్టోర్లతో మహిళల ఆదరణ చూరగొంది. రాబోయే రెండేళ్లలో తెలంగాణలో 20 నుంచి 25 స్టోర్లను ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకుంది. స్థానికంగా ఉపాధి కల్పిస్తూ తన ఆఫ్‌లైన్ నెట్‌వర్క్‌ను విస్తరించాలన్న ఉద్దేశంతో అడుగులు వేస్తుంది. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఆర్ లైఫ్‌స్టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ కపూర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో ఏళ్ళుగా మా వద్ద ఆన్‌లైన్‌లో దుస్తులు కొనుగోలు చేస్తున్న కస్టమర్లు ఉన్నారన్నారు. ఆ గణాంకాలే ఇక్కడ ఆఫ్‌లైన్ స్టోర్ ఏర్పాటు చేయడానికి కారణమన్నారు. ఇక్కడ మరో 20 నుంచి 25 స్టోర్లను ప్రారంభించడం చిన్న లక్ష్యమేమీ కాదన్నారు.

ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఆర్ లైఫ్‌స్టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహ-వ్యవస్థాపకురాలు శీతల్ కపూర్ మాట్లాడుతూ హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆ ప్రగతి ప్రయాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. మేం మహిళలను దృష్టిలో ఉంచుకునే మా దుస్తులను డిజైన్ చేస్తున్నామన్నారు. ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయల్దేరి, రాత్రి 9 గంటలకు తిరిగొచ్చే మహిళలు మధ్యలో ఉద్యోగం, కుటుంబ బాధ్యతలు, అప్పుడప్పుడు పెళ్లిళ్లు, వేడుకలు ఇలా ఎన్నో చూసుకోవాల్సి ఉంటుందన్నారు. అలాంటి వారికి ఆకర్షణీయంగా కనిపించే దుస్తులతో పాటు రోజంతా సౌకర్యంగా ఉండేవి కావాలన్నారు. ఈ రెండింటి కలయిక అంత సులభం కాదన్నారు. ఒక స్టోర్‌కు వచ్చినప్పుడు స్వయంగా ఫ్యాబ్రిక్ నాణ్యతను, ఫిట్టింగ్‌ను చూసుకోవచ్చున్నారు. తీరికగా ఎంచుకోవచ్చున్నారు. స్క్రీన్‌పై చూసి కొనేటప్పుడు ఈ అనుభూతి లభించదన్నారు. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రిటైల్ మార్కెట్లలో హైదరాబాద్ ఒకటిగా ఉండటం, రాష్ట్రవ్యాప్తంగా మాల్స్, ఫ్యాషన్ రిటైల్ రంగం శరవేగంగా విస్తరిస్తుండటం అనుకూల అంశం. ఈ స్టోర్‌లో ప్రత్యేక సందర్భాల కోసం రూపొందించిన చీరల నుంచి రోజువారీ కుర్తాలు, దుపట్టాతో కూడిన కుర్తా సెట్లు, కుర్తీలు, ట్యూనిక్స్, కో-ఆర్డ్స్ వంటి ఆధునిక వర్క్‌వేర్‌లతో పాటు వైడ్ లెగ్ ప్యాంట్లు, లెగ్గింగ్స్ వంటి బాటమ్ వేర్ సహా మహిళల పూర్తి స్థాయి ఎత్నిక్ వేర్ కలెక్షన్‌ను అందుబాటులో ఉంచారు. జాతీయ స్థాయిలో 25 లక్షలకు పైగా కుటుంబాలకు చేరువైన ఈ బ్రాండ్ ఇప్పటివరకు 75 లక్షలకు పైగా దుస్తులను విక్రయించింది. అంతర్జాతీయంగా తన ఉనికిని విస్తరిస్తూ.. సొంత వెబ్‌సైట్ www.byshree.com తో పాటు Myntra, Amazon, Nykaa Fashion ఈజీబష్టతినీని వంటి ప్రధాన ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో కూడా ఆన్‌లైన్ స్థానాన్ని సంపాదించుకుంది.

## శ్రీలంకలో మూడు రోజులు పర్యటించనున్న రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ 2026 సెప్టెంబర్ 08 నుంచి 10 వరకు మూడు రోజులపాటు శ్రీలంకలో పర్యటించనున్నారు.

ఈ అధికార పర్యటనలో భాగంగా కీలక అంశాలపై శ్రీలంక అగ్రనాయకత్వంతో జరిగే ద్వైపాక్షిక చర్చల్లో ఆయన పాల్గొంటారు. కొలంబోలోని భారతీయ సమాజంతో ముఖాముఖి సంభాషిస్తారు. రక్షణ మంత్రిత్వ శాఖ, విదేశాంగ మంత్రిత్వ శాఖలకు చెందిన సీనియర్ అధికారులతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో ఆయన శ్రీలంక వెళతారు.

భారత్, శ్రీలంక దేశాలు నాగరికతా సంబంధాలను, బహుముఖ భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నాయి.

ప్రాంతీయ భద్రత, రక్షణ, ఆర్థిక, వాణిజ్య సహకారంతో పాటు ప్రజల మధ్య బలమైన సంబంధాలు ఈ భాగస్వామ్యానికి ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి

శ్రీలంకకు ఆర్థిక సంక్షోభ సమయంలో భారత్ అండగా నిలవడం, 2025లో శ్రీలంకలో సంభవించిన 'దిత్వా' తుపాను అనంతరం తొలి స్పందన దేశాల్లో ఒకటిగా భారత్ సహాయ సహకారాలు అందించడం ద్వారా ద్వైపాక్షిక సంబంధాలకు మరింత ఊతం లభించింది.

'పొరుగు దేశాలకు మొదటి ప్రాధాన్యం' విధానంపై భారత్ కొనసాగిస్తున్న నిబద్ధతను, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రతిపాదించిన మహాసాగర్ (ప్రాంతాల మధ్య భద్రత, అభివృద్ధి కోసం పరస్పర, సమగ్ర పురోగతి) దార్శనికతకు ఇస్తున్న ప్రాధాన్యతను ఇది స్పష్టంగా చాటిచెప్పింది.

రక్షణ మంత్రి శ్రీలంక పర్యటన ఇరు దేశాలకు పరస్పరం ప్రయోజనకరమైన రంగాలతో పాటు బలమైన సముద్ర తీర, రక్షణ భాగస్వామ్యంతో కూడిన సాంప్రదాయక, స్నేహపూర్వక ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టం చేస్తుంది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.